ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

కథా నిలయం
శ్రీకాకుళం

స్నేహ

ఆగస్టు14, 2005



స్వాతంత్ర్యం కోసం మేం కూడా...

లేసులు అల్లుదామా !

ఓ ఊరికథ - బొజ్జనకొండ

దిగులుపడకే సహోదరీ

హ్యాపీ బర్త్‌డే

14.8.2005 నుంచి 20.8.2005 వరకు

కె. సాయిప్రీతమ్
8సం॥, 14.8.1997
శ్రీనివాస్
హైదరాబాద్

వి. అజయ్‌కుమార్
10సం॥, 14.8.1995
రమణాజి-అప్పారావు
హరిపాలెం-విశాఖ

ఎ. మోనా
2సం॥, 14.8.2003
రేణుక-శ్రీనాథ్
సైదాబాద్-హైదరాబాద్



హేమంత్ కుమార్
1సం॥, 14.8.2004
మునిరత్నమ్మ-రమేష్
తొండురు-చిత్తూరు



డి. ఖద్యోతన్ చౌదరి
4సం॥, 15.8.2001
లక్ష్మీవెంకట
నాగశైలజ-తిలక్ చంద్
గుడివాడ-కృష్ణా

వి. తరుణ్
3సం॥, 15.8.2002
ఉమ-లక్ష్మీనాయక్
తిరుమలదేవరపల్లి-
అనంతపురం

వి. తేజ
1సం॥, 15.8.2004
ఉమ-లక్ష్మీనాయక్
తిరుమలదేవరపల్లి-
అనంతపురం

కె. సాయి వినీల
8సం॥, 16.8.1997
పార్వతి-పుల్లారావు
నర్సరావుపేట

ఎం. కౌసల్యారాణి
8సం॥, 16.8.1997
పద్మకుమారి-సోమనాథ్‌బాబు
కృష్ణలంక-విజయవాడ

జె. యుగంధర్ (శంకరయ్య)
4సం॥, 17.8.2001
శర్వాణి-
రవీంద్రనాథ్‌ఠాగూర్
ఆత్మకూరు-కర్నూలు

పి. ప్రత్యూష్
6సం॥, 17.8.1999
విజయ-ఆశయ్య
జమిస్తాన్‌పూర్-
హైదరాబాద్

బి. పండు
2సం॥, 18.82003
రాధాకుమారి-శ్రీనివాస్
రిబ్బనపల్లి-తూ॥గో

లోకేష్
2సం॥,
18.8.2003
మహేశ్వరి-
శివశంకరావు
నూతక్కి-గుంటూరు

వై. సంపత్‌కుమార్
2సం॥,
19.8.2003
సుజాత-రత్నం
కడప

పి. రామాదేవి
6సం॥,
19.8.1999
శారదాదేవి-
శ్రీనివాసాచార్యులు
అరండల్‌పేట-
గుంటూరు

ఇ. బాబు (బన్ని)
1సం॥,
19.8.2004
నీలిమ-సువర్ణరాజు
కొత్తనరసాపురం-
ప॥గో

మరికొన్ని ఫొటోలు మూడవ కవర్ పేజీలో

ఈ వారం అతిథి

ప్రేమ-అప్యాయతలతో కూడిన విలువలుండాలి

మన అతిథి గురించి...

పేరు	-	కృష్ణక్కగా సుపరిచితులైన డా॥కెవి కృష్ణకుమారి,
పుట్టిన ఊరు	-	కాకినాడలో పుట్టినప్పటికీ...తెనాలి వాసిగా పెరిగారు.
తేది	-	స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది 1947 ఫిబ్రవరి 6న
విద్య	-	వైద్య విద్యనభ్యసించినా...సాహితీ చికిత్స చేస్తున్నారు.
నచ్చిన వ్యక్తి	-	అన్నయ్య అని తప్ప పేరుపెట్టి ఎప్పుడూ పిలవని డా॥అక్కినేని నాగేశ్వరరావు గారు, పెంపుడు తండ్రి వంటి నీలం సంజీవరెడ్డి గారు.
నచ్చని అంశం-		స్వార్థం, ఎదుటివారిలో తప్పులెతకడం, ప్రేమరాహిత్యం.

అన్నింటికంటే పవర్‌ఫుల్ మీడియా ప్రచురణరంగం. అన్నింటా చెడు చూపించడం ఎక్కువైపోయినట్లే పత్రికల్లో కూడా ఎక్కువౌవుతోంది. ఈనాడొస్తున్న కొన్ని పత్రికలను ధైర్యంగా నట్టింట టీపాయ్ మీద వదిలివెళ్లలేని పరిస్థితి దాపురించింది. ఇంట్లోని చిన్నపిల్లలెక్కడ చూస్తారోనని భయం. ఏది మంచి, ఏది చెడు అనే విశ్లేషణ చేసుకోలేని వయసువారు అలాంటివాటిని చూసి ఏం నేర్చుకుంటారోనని ఆందోళన కలుగుతుంది. మంచి కంటే చెడే ఎక్కువ ప్రభావం చూపుతుంది కదా! ఎందుకంటే చెడు ఎక్కువ ఆకర్షిస్తుంది. మంచి నుంచి మంచి గ్రహించడం సులువైన పనే. కానీ చెడు నుంచి కూడా గుణపాఠం నేర్చుకున్నట్లు మంచిని గ్రహించగలగాలి. అలాంటి క్షీర, నీర న్యాయం అలవర్చుకోవాల్సివుంది.

నేడు విద్య, వైద్య రంగాలేంటి అన్ని రంగాల్లో అవినీతి పెరిగిపోతోంది. దాన్ని ప్రోత్సహించేవారు కూడా అదే తమదాకా వస్తే ఏ ప్రభావం, ఏ ప్రమాదం కలుగుతుందో ఆలోచించుకుంటే ఈ స్థితి రాకపోవచ్చు. ఈ స్థితి చూసి మా లాంటివారం కూడా తీవ్ర ఆందోళనకు గురై అస్త్ర సన్యాసం చేసే నిరాశకు గురౌతున్నాం. ఈనాటి స్థితితో రాజీపడలేక అలా అన్నాను కానీ... పెన్ను వదిలేయడం జరగదనుకోండి. కొన్ని విలువలకు కట్టుబడి, మంచి-మానవత్వం-ప్రేమ-ఆధ్యాత్మికతను సమపాళ్లలో రంగరిస్తూ పరిష్కారాలను చూపించడానికి అలవాటు పడిపోయిన రచయితను. అదే ప్రాణంగా, జీవంగా బతికినవాళ్లం కదా! ఈనాటి వ్యాపారసంస్కృతిలో విలువలు కోల్పోతున్న నేటి సమయంలో కూడా కలంద్వారా చేయగల్గింది చేస్తాను.

ఉన్నత విలువలు, ఆధ్యాత్మిక విలువలు అంతరించిపోకూడదు. అధ్యాత్మిక విలువలు అంటే దేవుడి చుట్టూతా, పూజలు చుట్టూతా తిరగటం కాదు. విశ్వమానవ ప్రేమకు అర్థం చెప్పుకునే తత్వానికి రావడం. అటువంటి ప్రేమాప్యాయతలతో కూడిన ఆధ్యాత్మికత వేళ్లూనుకోవాలని కోరుకుంటున్నాను.

ఈ సంచికలో...

- టపా ... 2
- టర్నింగ్‌పాయింట్ ... 4
- సలహాలు ... 5
- ఇంటి సంగతులు ... 6
- నేర్చుకుందాం..రా! ... 7
- క్యాంపస్ చాట్ ... 10
- సినిమా కబుర్లు ... 11
- బాలనేస్తాలు ... 12
- అట్టమీది కథ ... 14
- టెంగ్లీషు ... 20
- ఓ ఊరి కథ ... 21

సీరియల్ 8 మాధవి



ఇంకా,,,

మనసా తెలుసా 3 "ప్రేమా... దోమా... జాన్తానై"

ఆ నవ్వులు వినబడేదెప్పుడో కథ ... 18

- ఆరోగ్యం ... 17
- పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
- అవీ... ఇవీ 22
- విజ్ఞానవీచిక ... 23
- కొత్త పుస్తకాలు ... 24

హైపర్ మార్కెట్స్

అట్టమీది కథ "హైపర్ మార్కెట్స్" మమ్మల్నెంతగానో ఆకట్టుకుంది. గ్లోబలీకరణ ఫలితంగా రిటైల్ వ్యాపారంలో చోటుచేసుకుంటున్న మార్పులను తెలుసుకున్నాం. సరళీకరణ విధానాలు కిరాణాషాపులనేవిధంగా దెబ్బతీస్తున్నాయో చక్కగా వివరించారు.

హేమ, కడప

ఎంతగానో నచ్చింది

'స్నేహ' ఆదివారం అనుబంధంలో 'ఇదేం ఇల్లురా బాబూ...' అనే శీర్షిక మాకెంతగానో నచ్చింది. ఇంట్లో అందరూ కలిసి కట్టుగా పనులు చేసుకుంటే ఆ ఇల్లు ఇక స్వర్గసీమే అవుతుంది. ఈ విషయాన్ని చక్కగా తెలిపారు. ఈ శీర్షికను మా స్నేహితులందరం కలిసి చదివాం. ఇల్లు సర్దుకునే తీరును చక్కగా వివరించారు.

జె. శ్రావణి, డి. శ్రీవాణి, పాల్వంచ

చక్కటి సూచన

'ఇంటి సంగతులు' శీర్షికల్లో 'ఇదేం ఇల్లురా బాబోయ్...!' అనే రచన ఎంతో ఆచరణయోగ్యంగా ఉంది. 'సూక్ష్మంలో మోక్షం' లాగా మనకున్న దానిలోనే ఇంటిని స్వర్గసీమగా మార్చుకోవచ్చని ఓ చక్కటి సూచన చేశారు. ముఖ్యంగా అందరి సహకారం ఉంటేనే ఇంటిని చక్కదిద్దుకోవచ్చనే సందేశం స్ఫూర్తినిచ్చింది. ఇంట్లో గృహిణులు ఈ విషయంలో కుటుంబ సభ్యుల సహాయం కోరాలని పరోక్షంగా తెలియజేశారు. 24వ తేదీ 'స్నేహ'లో 'గొల్లుమన్న అల్లుడు' కథ హాస్యభరితంగా ఉంది. ఆఫీసులో ఒకరి కష్టాలు మరొకరు తెలుసుకుంటే, అందరూ కలిసి పరిష్కరించవచ్చని తెలియజేశారు. చక్కని మానవసంబంధాలను చిత్రీకరించారు.

సిహెచ్ సీత, కొత్తగూడెం

టపా

జాగృతం చేస్తున్నారు

'స్నేహ' సంచిక పాఠకుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. కొత్త శీర్షికలతో పాఠకలోకాన్ని రంజింపజేస్తోంది. 'ఈ వారం అతిథి'తో సమాజాన్ని జాగృతం చేస్తున్నారు. 'మనసా తెలుసా' అంటూ టీనేజీ యువతీయువకుల్లో ప్రకృతి సిద్ధంగా వచ్చే పరిణామ దశలను వివరిస్తూ బాలబాలికల తల్లిదండ్రులకు మంచి సలహాలిస్తున్నారు. "మాధవి" సీరియల్ 'స్నేహ'కొక ప్రత్యేకాకర్షణ. కథలు వర్తమాన, సామాజిక జీవనానికద్దం పడుతున్నాయి. రాజకీయ వ్యంగ్య రచనలు, కార్టూన్లు సినిమా గత వైభవ పరిచయాలు, బాలల్లో విజ్ఞానాన్ని పెంచే విషయాలు పాఠకులనాలోచింపజేసే విధంగా ఉన్నాయి. నిత్య నూతన శీర్షికలందిస్తున్న ప్రజాశక్తి సంపాదక వర్గానికి నా అభినందనలు.

జివి నరసింహరాజు, రామకృష్ణాపురం

సరికొత్త గెటప్

వారం వారం 'స్నేహ' మేగజైన్ సరికొత్త గెటప్‌లో వస్తోంది. దీనిలోని శీర్షికలు మంచి స్పందనను కలిగిస్తున్నాయి. 'ఈ వారం అతిథి' రావూరి భరద్వాజ మాటలు అక్షర సత్యాలు. మానవసమాజంలో నేటికీ వస్తులతో జీవితాలు గడుపుతున్న వారెందరో ఉన్నారు. సరైన ఉపాధి అవకాశాలు దొరక్క నిరాశ నిస్పృహలతో జీవించే వారూ ఉన్నారు. ప్రతిమనిషీ జీవించే విధంగా విద్యావిధానంలో మార్పులు రావాలి. యువతీయువకులందరూ స్వయం ఉపాధి కల్పనలో తమకు నచ్చిన వృత్తి విద్యలో శిక్షణ పొందేవిధంగా చట్టాలు రావాలి. 'సినిమా కబుర్లు' శీర్షికలో 'అలనాటి పాట' చాలా ఆసక్తికరంగా విశ్లేషించారు. ఈ పాట వర్తమాన సమాజానికి కనువిప్పు కలిగిస్తుంది. కథలు కనీసం రెండైనా వేస్తే బాగుంటుంది. జోక్సు వారానికి 20 అయినా ప్రచురించగలరని కోరుతున్నాం.

జె. సుధాకరరావు, కాకినాడ

నవ్వించింది

'పప్పెట్ ఇంటర్వ్యూ' శీర్షికలో 'నిరాశపడకండి! మంచి రాజకీయాలున్నాయ్!' మమ్మల్నెంతో ఆలోచింపచేసింది. 'ఎవరిగోలవారిదే...' కథబాగుంది. 'హైపర్ మార్కెట్స్' చాలా బాగుంది. 'అలనాటి పాట' 'ఏరువాక సాగారో...' ఇప్పటికీ మా చెవుల్లో మారుమోగుతోంది. 'కబుర్లుకాదు... కార్యాచరణ కావాలి' ఈ వారం అతిథి రావూరి భరద్వాజ గారు చెప్పిన విషయాలు అక్షరసత్యాలు. ఇలాంటి మహనీయుల పరిచయాలు మాలో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

బిక్కునూరి రాజేశ్వర్, పొన్కల్

తెలుసుకోగలిగాం

కృష్ణాజిల్లాలో ఉన్న ఆంధ్రుల తొలి రాజధాని శ్రీకాకుళం విశిష్టతను, గొప్పతనాన్ని 'ఓ ఊరికథ'లో తెలుసుకోగలిగాం. 'టర్నింగ్ పాయింట్' లో వాస్కోడిగామా గురించి తెలియజేశారు. ఇది చదువుకునే పిల్లలకెంతో విజ్ఞానదాయకంగానూ, ఉపయోగకరంగానూ ఉంది. ప్రతి వారం సరికొత్త శీర్షికలను ప్రవేశపెడుతున్న ప్రతికా ఎడిటర్ గారికి, సిబ్బందికి మా ధన్యవాదాలు.

కాశీ విశ్వేశ్వరరావు, సూర్యవంశీధర్, మద్రిపాలెం

బాగా నచ్చింది

మాది మారుమూల గ్రామం. మొట్టమొదటి సారిగా ప్రజాశక్తి చదివా. బాగా నచ్చింది. ఇప్పటి నుంచి చదువుతాం. న్యాయసలహాలు శీర్షిక చాలా బాగుంది. 'హ్యాపీ బర్త్ డే' ఫీచర్, 'వందేమాతరం' శీర్షికలు బాగా నచ్చాయి. ప్రచురణకర్తలకు, సిబ్బందికి మా ధన్యవాదాలు.

జాలిమి కురుమన్న, మన్నెమ్మ, మహబూబ్ నగర్

ఎన్నాళ్లకూ మర్చిపోలేను

'క్యాంపస్ ఛాట్'లో ఎన్నో రోజులనుండి వెతుకుతున్న పుస్తకం కనిపించిన తరువాత హిమజ ఎవరికంటైనా పడితే... అమ్మో...! అనుకుంది. కానీ నిజానికున్న ప్రాముఖ్యతను తెలుసుకుని నిజాయితీని చూపించింది. అలాగే కామర్స్ విద్యార్థిని సుశీల అందరికన్నా ఎక్కువ మార్కులు రావాలన్న తాపత్రయంతో చదువుతుంటే నిజంగా నా కాలేజీ రోజులు గుర్తొచ్చాయి. ఈ విషయాన్ని ఎన్నాళ్లకూ మర్చిపోలేను.

కర్రా వరప్రసాద్, యలమర్రు కండ్రిక

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

కౌన్సిలింగ్ సైకాలజిస్ట్

పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్

"ప్రేమా... దోమా... జాన్తానై"

క్రష్ మనోభావాలకు, ప్రేమకు గల తేడా ఏంటి?. క్రష్ భావాలు ఎవరికి వారే పెంచుకునే మనో భావాలు కాగా, ప్రేమలో పడటమొక సంబంధం. "ప్రేమ" అంటే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగేది. మొన్నటివరకు ఇది రచయితల, కవుల, వేదాంతుల సొత్తు. మనస్తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు దీని గురించి ఆలోచించనే లేదు. ప్రపంచాన్ని నడిపేది "ప్రేమ" అని అనుకుంటున్నప్పటికీ దీన్ని వివరించటానికెవరూ పూనుకోలేదు. అయినప్పటికీ, ఏదో రకంగా మనమందరం దీన్ని అనుభూతులలో పొందిన వాళ్ళమే! దీనికోసం కలలుగని, అవస్థలు పడ్డవాళ్లమే. దీని తేజోవంతమైన ఆనందపు వలలో చిక్కుకుని, గందరగోళంలో పడిఉంటాం అనడమూ సముచితమే. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో టీనేజి యువతీయువకుల్లో ప్రేమ వ్యవహారాలు ఎక్కువౌతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రేమ గురించి శాస్త్రీయదృక్పథాల్ని పరిశీలించడం అవశ్యకం.

"ప్రేమ" అంటే ఏమిటి ? దీన్ని నిర్వచించాలనుకోవటం సాహసమే. అంతేకాక చాలా కష్టమైంది కూడాను. ఎందుకంటే పలు నిర్వచనాలు ఉన్నాయి కాబట్టి. శతాబ్దాలు తరబడి ఎందరో మహానుభావులు, విజ్ఞులు, ఈ ప్రేమను వివరించాలని, నిర్వచించాలని, ఫలానాదే కచ్చితంగా ప్రేమని బల్లగుద్ది చెప్పాలని ప్రయత్నించారు. మానవ సంబంధాల విషయంలో భర్తను, ప్రియుణ్ని, ప్రియురాలిని, ప్రేమించడంతో పాటు, పిల్లలను, తల్లిదండ్రులను, తోబట్టువులను, పెంపుడ జంతువులను, దేశాన్ని ప్రేమిస్తారు. ఇంద్రధనుస్సును, సముద్రతీరాన్ని, ప్రకృతిని ఇలా అన్నిటినీ మనిషి ప్రేమిస్తాడు. ఇన్ని విభిన్న సందర్భాలలో, వేర్వేరు అర్థాలను దృష్టిలో పెట్టుకుని వినియోగించడానికి ఇంగ్లీషులో ఒకే ఒక పదముంది అదే లవ్.

నేటి పరిస్థితుల్లో టీనేజి యువతీయువకులల్లో ప్రేమ వ్యవహారాలు ఎక్కువౌతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రేమ గురించి శాస్త్రీయదృక్పథాల్ని పరిశీలించడం అవశ్యకం. టీనేజి వయస్సులో ఒక వ్యక్తి ప్రేమలో పడినా, ఎవరైనా అతనిని ప్రేమిస్తున్నా సదరు ప్రేమలో నిజాయతీ శాతం ఎంతుందనేది తూకం వేయలేం. అది ప్రేమించే వ్యక్తులే నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

సైకాలజీలో ప్రేమ : 1950లో ఎరిక్‌ఫ్రోం తన పుస్తకంలో పరస్పరం పట్టించుకోవటం, గౌరవించుకోవటం ప్రేమని రాశాడు. ఆత్మావలోకనం ద్వారా అర్థవంతమైన ప్రేమను సాధించగలరన్నాడు. వ్యక్తిత్వాన్ని సంరక్షిస్తూ వారితో సంగమించడం అనేది పరిపక్వతనొందిన ప్రేమకు నిదర్శనమన్నాడు. ఒకటై కూడా విడివిడిగా మిగిలిపోవడం ప్రేమకు విరుద్ధమన్నారు. అర్థవంతమైన ప్రేమకోసం ఆత్మావలోకనం చేసుకోవాలన్నది ఫ్రోం వాదన.

రచయితల దృష్టిలో ప్రేమ : మనిషికి, మనిషికి మధ్యన గల "ప్రేమ" గురించి రాబర్ట్‌హెన్‌లీన్ ఇచ్చిన నిర్వచనం కొంచెం సరళంగానే అన్పిస్తుంది. అవతలి వ్యక్తి ఆనందం, నీ ఆనందమంత ప్రాముఖ్యత కల్గినదిగా నీవు భావించే స్థితినే ప్రేమ అనొచ్చని అన్నారు రాబర్ట్. రోమియో జూలియట్‌లో షేక్స్‌పియర్ వర్ణించిన ప్రేమ ఇదే! ఇదే ఎనిమిదవ ఎడర్డ్, తను ప్రేమించిన ప్రియురాలిని పెళ్ళి చేసుకోవటానికి ఇంగ్లాండ్ సింహాసనాన్ని కూడా కాలదన్నేలా చేసింది. ఏ రకమైన ప్రేమ అయినప్పటికీ, ప్రేమించిన వ్యక్తి గురించి ఆలోచించడం ముఖ్యం.

కల్పనకి వాస్తవానికి తేడా తెలుసుకోవడం కష్టం : ఒక యువకుడు తన తోటి అమ్మాయిని శారీరకంగా పొందడం కోసం మాత్రమే "ఐ లవ్ యు" అనొచ్చు. లేదా ఆమె కోసం ప్రాణాలైనా అర్పించే గుణం తనకుందని ప్రకటించుకోవడం కోసం కూడా అలా అనవచ్చు. అతని మాటల ద్వారా అది ఆ అమ్మాయి పట్ల అతనికి గల నిస్వార్థ పూరితమైన ప్రేమను బయటపెట్టకపోవచ్చు. కాగా కొంతమంది డబ్బు ఆకర్షణ, హోదా, అధికారం మొదలైన వాటి వలన కూడా ప్రేమను నటిస్తారు. లైంగికవాంఛ ప్రేమ రెండూ వలపును, 'అంతా' పొందేయాలన్న భావనను కల్గివుండటంతో, రెంటినీ వాటి తీవ్రతననుసరించి విడదీయటం కష్టం. లైంగిక వాంఛలు సులభంగా బయటపడేవి. నిమ్నభావోద్రేకం కల్గి వుండేవి. కానీ ప్రేమ భావనలు మరింత సంయుక్తమైనవి, స్థిరమయినవి. లైంగిక వాంఛ, స్వచ్ఛమైన, కల్మషం లేని, భావానికి కేంద్రం కాదు. టీనేజి వయస్సులో ఒక వ్యక్తి ప్రేమలో పడినా, ఎవరైనా అతనిని ప్రేమిస్తున్నా సదరు ప్రేమలో నిజాయితీ శాతం ఎంతుందనేది తూకం వేయలేం. అది ప్రేమించే వ్యక్తులే నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. క్రష్ భావాలకు ప్రభావితమైన కారణంగా ప్రేమలో పడ్డారా లేక అలౌకిక భావాల ఫలితంగా ప్రేమలో పడ్డారా అన్నది తెలుసుకోవడం అంత తేలిక కాదు. దీన్ని నిర్ధారించుకోవడానికి యువతలో విశ్లేషణా పూర్వకమైన అవగాహన అనివార్యం ✤



టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

గాంధీని మహాత్ముడిగా మార్చిన రైలు

మానవేతిహాసంలో ఎందరో మహానుభావులు తమ ఆత్మార్పణతో, త్యాగనిరతితో సమాజగమనాన్ని ఆదర్శాల వేపు మళ్లించారు. భావితరాలకు మార్గదర్శకులయ్యారు. అయితే చరిత్ర నిర్మాతలు ఏ కొందరు నాయకులో కారు. ప్రజలే! ఒక్కో చారిత్రక దశలో నెలకొన్న అనేకానేక పరిస్థితులు నాయకులను సృష్టిస్తాయి. వీరు సమాజానికి దిశానిర్దేశం చేస్తారు. దాన్ని ముందుకు తీసుకెళతారు. ఆధునిక యుగంలో ఎందరో ఆదర్శజీవులు చరిత్రను కొత్త మలుపు తిప్పారు. భారతదేశం దీనికి మినహాయింపుకాదు. అలాంటి వారందరిలోకెల్లా మహాత్మా గాంధీ ఓ విలక్షణమైన వ్యక్తి. మట్టినుండి మాణిక్యాలను సృష్టించగల నేర్పు గొప్ప నాయకులకుండాల్సిన మొదటి లక్షణం. గాంధీజీ నాయకత్వంలో గొప్ప పేరు సంపాదించుకున్న నాయకులెందరో సామాన్యకుటుంబాల నుంచి వచ్చినవారే.

గాంధీజీ పుట్టుకతోనే నాయకుడు కాదు. అందరిలాగే పెరిగాడు. పై చదువులకు ఇంగ్లండుకెళ్లాడు. అక్కడ న్యాయవాదవృత్తిలో పట్టా తీసుకుని తిరిగొచ్చాడు. ఆర్థికంగా కొద్దో గొప్పో స్థిరత్వం కలిగిన కుటుంబాలవారు తమ పిల్లలను విదేశాలకు పంపి, న్యాయవిద్య చదివించడం అప్పట్లో రివాజు. ఇంగ్లండ్ నుండి గాంధీ 1891లో తిరిగొచ్చాడు. కథియవార్‌లోని రాజ్‌కోటలో ప్రాక్టీసు ప్రారంభించాడు. విద్యలో ఆరితేరినా వృత్తిలో రాణించలేక పోయాడు. పైగా రాజ్‌కోటలోని ఆంగ్లరాజకీయ ప్రతినిధితో సరైన సంబంధాలు లేకుండా పోయాయి. ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో దక్షిణాఫ్రికాలో ఉన్న భారతీయుల తరపున ఒక సివిల్ వాజ్యంలో పనిచేసే అవకాశం వచ్చింది. రానూ పోనూ ప్రయాణ ఖర్చులు, ఫీజు 105 పౌండ్లు, ఒక సంవత్సరం పాటు అక్కడుండే విధంగా ఒప్పందం చేసుకున్నారు.



1893లో డర్బన్ పట్టణానికి చేరాడు. అక్కడ తనకు ఉపాధి కల్పించిన సంపన్న భారతీయ వాణిజ్యవేత్త, అబ్దుల్లాను కలిశాడు. ఆయనతో కలిసి అక్కడున్న న్యాయస్థానానికెళ్లాడు. గాంధీజీ ఆ రోజుల్లో తలకో గుడ్డ కట్టుకునేవారు. కోర్టు ఆవరణలో ఉన్నప్పుడు దాన్ని తీసేయాలని గాంధీజీని అడిగారు. దానికి ఆయన నిరాకరించి, కోర్టు నుండి వెళ్లిపోయాడు. ఈ సంఘటన గూర్చి నిరసన తెలుపుతూ స్థానిక వార్తాపత్రికలకో ఉత్తరం రాశాడు. పత్రికలు గాంధీని "అనాహూత సందర్శకుడు"గా వర్ణిస్తూ రాశాయి. గాంధీ ఈ సంఘటనలతో కలత చెందాడు.

> **కోచ్‌లో నుండి దిగి డ్రైవర్ పక్కన కూర్చొని, ఫుట్ బోర్డు మీద ప్రయాణం చేయమని చెప్పినప్పుడు గాంధీ నిరాకరించాడు. దాంతో ఆంగ్లేయవాడి సహనం కోల్పోయి గాంధీని బలంగా కొట్టాడు. అయినా సీటు నుండి గాంధీ లేవలేదు. ఆ అధికారి దురహంకారాన్ని ఎంతో ధైర్యంతో, స్వాభిమానంతో ఎదుర్కొన్నాడు. ఈ ఘటనలే గాంధీ జీవితాన్ని మలుపు తిప్పాయి. తెల్లవారి ఆధిపత్యాన్ని ఎదుర్కోవాలన్న తీవ్ర ఆంకాంక్ష మొలకెత్తేట్లు చేశాయి.**

జాతి వివక్ష గూర్చి గాంధీజీ విన్నాడు. భారతదేశంలో అలాంటి ఘటనలు సంభవించినప్పుడు అవి కొందరు ఆంగ్లేయ అధికార్ల విపరీత చర్యలుగానే భావించాడు. ఇంగ్లండులో ఉండగా ఇలాంటి అనుభవం ఆయనకెన్నడూ ఎదురవలేదు. దీన్ని ఒకానొక ప్రత్యేక పరిస్థితుల్లో సంభవించిన అసాధారణ సంఘటనగా భావించి సమాధానపడ్డాడు.

డర్బన్ నుండి తాను పనిచేయాల్సిన ప్రెటోరియాకు రైల్లో బయలుదేరాడు దారిలో మారిట్జ్‌బర్గ్ స్టేషనుకు చేరాక ఒక రైల్వే అధికారి గాంధీని సాధారణ కంపార్టుమెంటులోకి వెళ్లవలసిందిగా ఆదేశించాడు. తనవద్ద ఫస్టుక్లాస్ టిక్కెట్టుందనీ, కాబట్టి తాను అక్కడి నుండి వెళ్లాల్సిన అవసరం లేదనీ గాంధీ వాదించాడు. అయినా ఆ అధికారి వినిపించుకోలేదు. గాంధీని సామానుతో సహా దౌర్జన్యంగా బయటికి గెంటేశాడు. ఎముకలు కొరికే చలి. చిమ్మ చీకటి. వెలుతురు సరిగా లేని వెయిటింగ్ రూంలో కూర్చొని గాంధీ దీర్ఘాలోచనలో పడ్డాడు. ఏం చేయాలి? అవమానాలు భరించి ఉండాలా? భారతదేశానికి తిరిగెళ్లాలా? ఇక్కడే గాంధీ ఒక ధృఢనిర్ణయానికొచ్చాడు. ముందుకు ప్రయాణించాలనే నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత ఛార్ల్స్‌టన్ స్టేషనుకెళ్లి, అక్కడినుండి స్టేజికోచ్‌లో ప్రెటోరియాకు వెళ్లేటప్పుడూ ఇదే అనుభవమెదురైంది. కోచ్‌లో నుండి దిగి డ్రైవర్ పక్కన కూర్చొని, ఫుట్ బోర్డు మీద ప్రయాణం చేయమని చెప్పినప్పుడు గాంధీ నిరాకరించాడు. దాంతో ఆంగ్లేయులు సహనం కోల్పోయి గాంధీని బలంగా కొట్టాడు. అయినా సీటు నుండి గాంధీ లేవలేదు. ఆ అధికారి దురహంకారాన్ని ఎంతో ధైర్యంతో, స్వాభిమానంతో ఎదుర్కొన్నాడు.

ఈ ఘటనలే గాంధీ జీవితాన్ని మలుపు తిప్పాయి. తెల్లవారి ఆధిపత్యాన్ని ఎదుర్కోవాలన్న తీవ్ర ఆంకాంక్ష మొలకెత్తేట్లు చేశాయి. ఇదే ఆ తర్వాత కాలంలో పెద్ద మానుగా ఎదిగి భారతదేశంలో వలసపరిపాలన అంతమొందించేందుకు దారితీసింది. ✤

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

నా కొడుకును తెచ్చుకోగలనా

మాది పేద కుటుంబం. *1994*న మా వివాహం జరిగింది. మాకి ఇద్దరు పిల్లలు. *1997*వ సం॥లో నా భార్య వివాహేతర సంబంధంవల్ల (పెండ్లి కంటే ముందు ప్రేమించిన వ్యక్తితో) వేం విడిపోయాం. ఆనాడు వారి ప్రాంతపు రంగారెడ్డి జిల్లా, శామీర్‌పేట మండలం బాలాజీ నగర్ గ్రామపంచాయితి పెద్ద మనుషుల ద్వారా నా భార్య నాకు విడాకులు రాసింది. ఆ సమయంలో పెద్ద పాప నాదగ్గర, చిన్న బాబు వయసులో మరీ చిన్నవాడైనందున ఆమె దగ్గర ఉన్నాడు. ఆమె ఇప్పటికీ అతనితోనే ఉంది. వారికి పిల్లలని తెలిసినది.

వారి దగ్గరున్న నా కుమారుణ్ణి తెచ్చుకోవడానికి ఏదైన మార్గం సూచించగలరు. బాబు వయస్సు ప్రస్తుతం తొమ్మిది సంవత్సరాలు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా నేను మరో వివాహం చేసుకోలేదు. తగిన సలహా ఇవ్వగలరు.

ఆర్. జానయ్య,
కడప (జిల్లా).

మీరివురు పెద్దల సమక్షంలో విడిపోయి కాగితాలు రాసుకున్నారు. అది చట్ట ప్రకారం చెల్లదు. హిందూ వివాహ చట్టం 1955 ప్రకారం మి వివాహాన్ని రద్దుచేసే అధికారం ఒక కోర్టుకు మాత్రమే ఉంటుంది. ఏ ఇతర వ్యక్తులకు ఆ అధికారం ఉండదు. ఇక మీ సమస్య. మీరు మీ బాబుని కావాలనుకుంటున్నారు కాబట్టి మీ బాబును మీరు పొందవచ్చు. దాని కోసం మీ దగ్గరలోని ఫ్యామిలీ కోర్టులో 'వార్డ్స్ అండ్ గార్డియన్స్ ఆక్ట్' ప్రకారం దావా వేసి అతడిని పొందవచ్చును. బాబుని మీరే పూర్తిగా ఉంచుకోవడానికి అర్హులు, మీ భార్యకు మరొకరి ద్వారా పిల్లలు పుట్టారంటున్నారు. అది మీ బాబుని పొందడం కోసం బాగా ఉపకరిస్తుంది కూడా.

ఎలాంటి హక్కు ఉండదు

నా కుమార్తె ధనలక్ష్మి. పెళ్ళి **7-3-91**న జరిగింది. వరుడు (స్టేట్‌బ్యాంక్) రాజమండ్రి వాస్తవ్యుడు పెళ్ళి అయిన తరువాత అతని తండ్రిగారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తూ మరణించారు. దాంతో మా అల్లుడు బి.వి.వి. సత్యనారాయణకి ఉద్యోగం వచ్చింది. తర్వాత ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. పెద్దవాడుకి **12** సంవత్సరాలు, రెండవ వాడికి తొమ్మిది సంవత్సరములు నా కుమార్తె. ధనలక్ష్మి **22-8-99**న చనిపోయింది. మా పిల్లలు నా వద్దనే ఉంటున్నారు. మా అల్లుడు బి.వి.వి. సత్యనారాయణ **25-12-2004**న మరణించాడు. అతడు చనిపోయిన తర్వాత బ్యాంకు తరుపున వచ్చే బెనిఫిట్‌లు పిల్లలకు చెందాలని మేం కోరాం. అతడు వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని ఆమె వద్ద ఆధారాలు ఉన్నావని బ్యాంకు వారు అన్నారు. ఆమెకు లోగడ వివాహం అయినది. ఆయన ద్వారా ఆమెకు ఒక ఆడపిల్ల ఉన్నది. ఆ పిల్లకు తొమ్మిది సం॥లు వయస్సు ఉన్నది. ఆమె తొలి భర్త ద్వారా చట్టపరమైన విడాకులు తీసుకోలేదు. ఆమె చేసుకున్న రెండవ వివాహం చెల్లుతుందా? మాకు అనగా పిల్లలు మైనర్లు, ఒకటి మనోజ్‌కుమార్ (**12**సం॥లు) రెండు అనీల్‌కుమార్ (**9**సం॥లు) వీళ్ళ నాయనమ్మ. బి. రత్నం. వయస్సు (**70** సం॥లు) పిల్లలను పెంచే శక్తిలేదు. యం.ఆర్.ఓ.ద్వారా లీగల్ ఎమర్ కూడా మాకు ఇవ్వలేదు. నా ఆరోగ్యం బాగాలేదు. నేను క్యాన్సర్ వ్యాధితో బాధ పడుచున్నాను. తగిన సలహా ఇవ్వగలరు.

చల్లా. జనార్ధనం (టైలర్)
అశ్వారావుపేట, ఖమ్మంజిల్లా.

మీరు మీ మనవళ్ళ తరుపున ఎంఆర్‌ఓ గారిని కలిసి లీగల్ ఫైల్ సర్టిఫికెట్ పొందగలిగితే మంచిది. ఒక వేళ లిటిగేషన్ ఉన్నా, ఎంఆర్‌ఓ గారు ఇవ్వనని అన్నా జిల్లా కోర్టులో బ్యాంకు వారిని, లీగల్ నోటీసు ఇచ్చిందని చెపుతున్న ఆ మహిళని ప్రతి వాదులుగా చేసి దావా వేయవచ్చు. మీరు మీ జిల్లా న్యాయాధికార్ని కలిస్తే వారే మీ తరుపున న్యాయవాదిని ఏర్పాటు చేస్తారు. దావా తొందరగా జరిగే ఏర్పాటు చేస్తారు. మీరు ఆ మహిళ మీ అల్లుడు భార్య కాదనే ఋజువులు చూపాల్సి ఉంటుంది. ఆమె మొదటి భర్తతో వివాహం రద్దు కాలేదు. కాబట్టి ఆవిడ వివాహం మీ అల్లుడితో జరిగినా ఆ వివాహం చెల్లదు. ఆమె కూతురు మీ అల్లుడి ద్వారా పుట్టినది కాదు కాబట్టి ఆమెకు గాని, ఆమె కూతురికి గాని ఎలాంటి హక్కూ ఉండదు.

ఎడిటర్ గారికో వరం

విశాఖపట్టణంలో జరిగిన ఒక పార్టీ మహాసభ వార్తా విశేషాలను కవర్ చేయటానికి ఒక పత్రిక న్యూస్ ఎడిటర్, విలేకరి, ఫొటోగ్రాఫర్ వెళ్లారు. ఆ పార్టీ ఒక తీర్మానం చేసే విషయంలో ఎటూ తేల్చుకోలేక సభను ఒక పూట వాయిదా వేసింది. దాంతో ముగ్గురూ రామకృష్ణాబీచ్‌లో కాలక్షేపం చేసొద్దామని బయలు దేరారు. అక్కడ వారు అందాన్ని చూసి ఊహాలోకాల్లో తేలిపోయారు. వారికి సముద్రదేవత ప్రత్యక్షమైంది. అయ్యో నేను ఎవరికి కనిపించినా మూడు వరాలు ఇస్తాను. మీరేమో ముగ్గురున్నారు ఎలా అంటూ తలా ఒక వరం కోరుకో మంది. వెంటనే ఫొటోగ్రాఫర్ తల్లీ ఈ సముద్రాన్ని అలా చూస్తూ ఎలాంటి ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా కలకాలం ఇక్కడే ఉండిపోయేలా అనుగ్రహించమ్మా అన్నాడు. తరువాత వంతు విలేకరికి వచ్చింది. అమ్మా నాకు నావలెక్కి ప్రపంచమంతా చుట్టిరావాలని ఉంది. అందువలన నాకుటుంబం ఇబ్బందులు పడకుండా నన్ను నావలెక్కించి విహరింపచేయి అన్నాడు. అనుగ్రహించిన దేవత మూడోవరం న్యూస్ ఎడిటర్‌ను కోరుకోమంది. అమ్మా సాయంత్రం ఆరుగంటలకు న్యూస్ ఇవ్వకపోతే నా ఉద్యోగం పోతుంది. అందువలన వారిని వెంటనే నాతో పాటు వచ్చేట్లు అనుగ్రహించమన్నాడు.

సత్య, విజయవాడ

ఇంటి సంగతులు

నా గొడవ నసలాగా ఉందా !!

పి. జ్యోతి

ఇదిగో చూడండి... మీ కెన్నోసార్లు. చెప్పాను మార్కెట్‌లో కొత్తగా కనపడిన వస్తువునల్లా కొనొద్దని వింటేనా..... మీకు తోడు ఇప్పుడు వీడొకడు తయారు. బాబూ కొడుకూ అన్నీ తెచ్చి ఇంట్లో పోగుపడేస్తున్నారు సర్దుకోలేక నేను చస్తున్నాను.రేపటి నుండి నాకు తెలియకుండా ఏదైనా కొని తెచ్చారో...!

'బాబ్బాబూ గట్టిగా మాట్లాడకే పొద్దున్నే ఎవరన్నా వింటారు, నీకు శ్రమతగ్గుతుందని షాపువాడు చెబితే కదా వస్తువులు కొన్నాను. అవి సరిగా పని చేయటం లేదు. తప్పునాదా? కావాలంటే రోడ్డుమీద పడవెయ్ అంతేగానీ నసపెట్టొద్దు.'

'ఏమిటీ నసలాగా ఉందా నాగొడవ, మీకేవండీ మగమహారాజులు.. చూడండి ఇందాకటి నుండి నేను పోరుపెడుతున్నానా ఆ ఏరోప్లేన్ బొమ్మను ఏ ముక్కకు ఆ ముక్క విరిచి పడేస్తున్నాడు మీ కొడుకు. మా అన్నయ్య ఎంతో ముచ్చటపడి తెచ్చారు.'

తెచ్చుకున్నప్పుడున్న శ్రద్ధ ఇంటికి తెచ్చాక ఉండకపోతే కష్టం. వాటినెక్కడో పడేస్తే దుమ్ము ధూళి పడి ఎందుకూ పనికిరాకుండా పోతాయి. వాటికి ఇంట్లో మంచి స్థానం కల్పించి జాగ్రత్తచేసుకోవాలి. ఇలా అయితే అవి మన కంటికి కొన్నాళ్లపాటు కనిపిస్తూ ఆ ప్రదేశాలను గుర్తు చేస్తూ ఉంటాయి.

' నస కాదులే ఏదో మాటవరసకన్నాను. ఇకనుండీ నువ్వు చెప్పినట్లు ఏమీ తేను గానీ మరి వాడు ఏదైనా బొమ్మ కొనిపెట్టమని అడిగితేనో ?' ఇలా సాగుతుండగా అక్కయ్య, బావగారూ వచ్చారు.

' చూడండీ మీ మరిది గారు పనికి రాని వస్తువులన్నీ తెచ్చి ఇంట్లో పడేస్తుంటే నేను సర్దలేక చస్తున్నాను. అదే మంటే నసగా ఉందట.'

' అన్నయ్యా...'

' నాకుతెలుసులేరా బాబూ నేను నీకు అన్నయ్యను తెలుసుకో '

' మీ బావగారు కూడా తక్కువ తినలేదే బాబూ ఒకసారి మా మధ్య పెద్దగొడవే అయింది. దాంతో బంద్ చేశారు.'

మీ ఇంట్లోనూ ఎప్పుడైనా ఇలాంటి సీన్ జరిగి ఉంటుందా? చైనా బజార్ల పుణ్యమా అని ప్రతి ఇంట్లో ఇప్పుడు ఇలాంటి సమస్యలు మరింతగా పెరిగాయి.

వేసవి, పండుగ సెలవుల్లో మన బంధువుల లేదా స్నేహితుల ఇళ్లకో, లేదా దర్శనీయక్షేత్రాలకో వెళుతుంటాం. అక్కడ మనకు నచ్చిన వస్తువులు కొనుక్కుని తెచ్చుకుంటాం. మనకు కావలసిన వారు మనం వచ్చేటప్పుడు గిఫ్ట్స్ ఇస్తారు. "దీన్ని ఎల్లప్పుడూ నా జ్ఞాపకంగా నీ దగ్గరే ఉంచుకోవాలి సుమా" అని వారు ఇచ్చేటప్పుడే చెబుతారు. మనమూ ఆ వస్తువులనెంతో జాగ్రత్తగా కాపాడుకుంటాం.

చూసిందల్లా కొనకూడదు

వెళ్లిన చోటల్లా మన కంటికేది కనబడితే దానిని కొనెయ్యకూడదు. ఇలా చూసినదల్లా కొనడం వల్ల డబ్బు ఖర్చేకాక అవి తెచ్చి ఇంట్లో ఎక్కడో దగ్గర పెట్టేస్తే చెత్తలా తయారౌతాయి. తిరిగి వాటిని దాచలేం, పారేయలేం. ఇలాంటి వస్తువులు రోజురోజుకీ పెరిగిపోతే ఇంట్లో వీటిని సర్దడం, స్థలం కేటాయించడం కష్టమైపోతుంది. కాబట్టి ఏదైనా వస్తువు కొనేముందు నిజంగా మనకది ఉపయోగకరమా, లేదా అని బాగా ఆలోచించాలి. తప్పనిసరిగా అవసరమనుకుంటేనే కొనాలి. కొన్నికొన్ని ప్రదేశాల్లోని వస్తువులు అక్కడ మాత్రమే దొరుకుతాయి. బొమ్మలు కానివ్వండి, గాజుసామాను, పింగాణీ వస్తువులు, గంధం చెక్కతో చేసినవి ఇలా రకరకాలుగా ఉంటాయి. మళ్లీమళ్లీ ఇలాంటి చోట్లకెళ్లం కాబట్టి వెళ్లినప్పుడే తెచ్చుకోవాలి. తెచ్చుకున్నప్పుడున్న శ్రద్ధ ఇంటికి తెచ్చాక ఉండకపోతే కష్టం. వాటినెక్కడో పడేస్తే దుమ్ము ధూళి పడి ఎందుకూ పనికిరాకుండా పోతాయి. వాటికి ఇంట్లో మంచి స్థానం కల్పించి జాగ్రత్తచేసుకోవాలి. ఇలా అయితే అవి మన కంటికి కొన్నాళ్లపాటు కనిపిస్తూ ఆ ప్రదేశాలను గుర్తు చేస్తూ ఉంటాయి.

ఇంట్లో చిన్న పిల్లలున్నప్పుడు

ఇల్లన్నాక పెద్దవాళ్లు, చిన్నవాళ్లు అందరూ ఉంటారునే. మనం ఎక్కడినుంచో ఎంతో అపురూపంగా తెచ్చుకున్న విలువైన వస్తువులను చిన్నపిల్లలకు అందుబాటులో పెట్టామనుకోండి. ఏముంది వాటిని ఏ ఆటకో, వేషానికో లాగిపారేస్తారు.

ఆ వస్తువు కాస్తా బద్దలైపోతుంది. దానితోపాటు మన గుండె బాధతో ముక్కలవుతుంది. పిల్లల్ని కోపంతో రెండు దెబ్బలేస్తాం. అది వారు తెలియక చేసిన తప్పుని మనకు తెలిసినా ఆ క్షణంలో ఆవేశమొస్తుంది. వేరే ఆలోచనే ఉండదు. వారికి అందేలా పెట్టుకోవడం మనతప్పే. ఆ విషయం కాస్తా కోపం ఉపశమించాక కానీ గుర్తురాదు.

నిజం చెప్పాలంటే మన మిత్రులు ఎంతో ఆప్యాయంగా మనకు కానుకలిస్తారు. వాటిపై మనకెంతో మమకారముంటుంది. వాటి విలువను మనం రేటులో అస్సలు చూడం. వాటిని చూసినప్పుడల్లా మనకు అనురాగపు విలువే కనబడుతుంది. అందుకని వీటిని అపురూపమైన గిఫ్ట్స్‌గా భావిస్తాం. వీటిని పాడుచేసుకుంటే, తిరిగి ఎంత డబ్బుపోసి కొనుక్కోగలిగినా మన ఆప్తులు ఇచ్చిన వాటితో సమానం కావు కదా. కాబట్టి వాటిని పదికాలాలపాటు కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ✤

నేర్చుకుందాం...రా!

సండే డెస్క్

లేసులల్లుదామా...!

ఈ వారం క్రోషియా గురించి తెలుసుకుందాం. క్రోషియా అంటే లేసులు అల్లటం. వీటినే నర్సాపురం లేసులు అంటారు. ఈ అల్లిక పని చాలా తేలిక. తొందరగా నేర్చుకోవచ్చు. జేబు రుమాళ్లు, గౌనులు, బనీనులు, చేతి సంచులు, చిన్నపిల్లల టోపీలు (గుల్లలు), రంజాను టోపీలు అన్నీ తయారుచేయవచ్చు.

చీరలమీద, దిండు గలీబుల మీద చిన్న పువ్వులు అల్లి కుట్టవచ్చు. లంగాలకు లేసులు అల్లొచ్చు. ఇవన్నీ బజారుకి తీసుకుపోయి అమ్ముకోవచ్చు. రాబడి బాగానే ఉంటుంది.

సీతాలు నిరుపేద యువతి. తానుకూడా తన కుటుంబానికి వేన్నీళ్లకు చన్నీళ్లలా తోడ్పడాలని అనుకుంది. కుట్టు సెంటరులో చేరింది. అక్కడ నేర్పే సుజాతా టీచరు చెప్పినట్టు అల్లిక పనికి స్టీలుతో తయారుచేసిన 4,5,6,7,10 నంబర్లు కలవి సూదులు అవసరం. ఒక్కొక్క సూది అయిదు రూపాయలలోపే ధర ఉంటుంది.

దారంతో తయారుచేసే అల్లికలకు 4,5,6,7, నంబర్ల సూదులు వాడాలి. 10 నంబరు సూదిని, ఊలుతో తయారుచేసే అల్లికలలకు వాడొచ్చు.



ఈ అల్లిక సూదులకు ఒకవైపు కొక్కెం ఉంటుంది. అలా ఉండటం వల్ల జారిపోకుండా దారాన్ని లాగొచ్చు. ఆ కొక్కాన్ని 'హుక్' అంటారు. సూది మధ్య భాగంలో చదునుగా ఉంటుంది. కుడి చేతి బొటనవేలు, చూపుడు వేలు, మధ్యవేలు ఈ మూడు వేళ్ళతో చదునుగా ఉన్న భాగంలో సూదిని పెన్సిల్లా పట్టుకోవాలి. అప్పుడు అల్లడం తేలికవుతుంది.

ఈ లేసులు అల్లటానికి ప్రత్యేకంగా చాలారకాల దారాలు ఉన్నాయి. అందులో ఒక రకం 'మధురా కోట్స్' కంపెనీ వారి ఏంకర్ దారాలు. ఈ ఏంకర్ దారాలు (పర్లకాటన్) 8.20.40 నంబరువి. 8వ నంబరు దారం లావుగా ఉంటుంది. 10 గ్రాముల దారం ఖరీదు 15 రూపాయలుండొచ్చు.



20,40 నంబరు దారాలు సన్నగా ఉంటాయి. ఒక్కొక్క ఉండలో 20 గ్రాముల దారం ఉంటుంది. దీని ఖరీదు 30 రూపాయలు. ఈ దారాలు సన్నగా ఉండి, లేసులు అల్లటానికి బాగుంటాయి. ఇవి అన్ని రంగులలో దొరుకుతాయి.

లేసులు అల్లటానికి స్పేడ్ 10వ నంబరు దారం 2000 మీటర్ల ఉండ దొరుకుతుంది. దీని ధర 50 రూపాయలలోపు ఉంటుంది. డిన్నరు మ్యాట్సు లాంటి నర్సాపురం లేసులు అల్లేది ఈ దారంతోనే. ఇది తెల్లని దారం. ఇది ఎక్కువగా నర్సాపురంలోనే లభిస్తుంది.

ఇవికాక ఒక కేజి, అరకేజీ ముతకదారం ఉండలు కూడా దొరుకుతాయి. స్పేడ్ 10వ నంబరు దారంతో అల్లిన లేసు అమ్మకం ధర 70 రూపాయలు ఉంటే, ముతక దారంతో అల్లినలేసు అమ్మకం ధర 25 రూపాయలు ఉంటుంది. దారాన్ని బట్టే అల్లిన లేసు ఖరీదు మారుతుంటుంది.

సన్నని దారంతో అల్లితే డిజైన్ చిన్నదిగా కనపడుతుంది. ముతకదారంతో అల్లితే డిజైను పెద్దదిగా ఉంటుంది.

(అల్లికల రకాలు-విధాలు మరోసారి)

ఏం స్టైలురా !

ఒక హోటల్‌లో ఇద్దరు మిత్రులు టిఫిన్ చేస్తున్నారు.

"హబ్బ ! ఏం స్టైలురా ! ఎంచక్కా రెండు కాళ్ళు ఊపుకుంటూ దర్జాగా టిఫిన్ చేస్తున్నావ్" అన్నాడు మొదటి వాడు

"స్టైలా పాడా ! టేబుల్ క్రింద నుండి దోమలు కుట్టి చస్తుంటే" అసలు విషయం చెప్పాడు రెండవవాడు

- చలపాక ప్రకాష్

సీరియల్

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

(6వ భాగం)

మాధవి

గత వారం కథలో...

గాలవుడి గురుదక్షిణకై మారకపు సరుకుగా దానం చేయబడ్డ మాధవి అతని వెంట అడవుల బాట పట్టక తప్పలేదు. ముళ్ళూ రాళ్లు దాటుకుంటూనే తన వెంట వస్తున్నామెను తన పుణ్యకార్యానికుపయోగపడి, స్వర్గలోకప్రాప్తి పొందెదవని ఊరడిస్తాడు

ఈ జీవితం తుచ్ఛమైనదంటారు తెలుసా? తెలివైనవారు స్వర్గలోక ప్రాప్తికోసం పూజలు, యజ్ఞయాగాదులు చేస్తారు" అన్నాడు గాలవుడు నీళ్ళలో అలలను చూస్తూ.

"నిజమే కాబోలు... నా తండ్రి యజ్ఞాలు చేసి పైలోకంలోనే కాదు, ఇక్కడా సుఖంగా వున్నారు. నేనేమీ చేయలేదు కదా, అందుకే బలిపశువునయ్యాను" అంది మాధవి వ్యంగ్యంగా.

ఇక తర్వాత ,గాలవుడేమీ మాట్లాడలేదు. మౌనంగా వెళ్ళి పడుకున్నాడు. మధ్యాహ్నానికి లేచి... "చాలా ఆకలిగా వుంది మాధవీ, నీ దగ్గరేవో ఆహార పదార్థాలున్నట్లున్నాయి..." అన్నాడు గాలవుడు సంశయంగా.

మాధవి మూట విప్పి అందులో చుట్టివున్న అరిటాకులు కూడా తీసి వడ్డించింది. పడవవ్యక్తి అంత రుచికరమైన పదార్థాలు జన్మలో తినలేదని పరమానందంగా చెప్పాడు.

మరికొంతసేపు ప్రయాణించాక ఆవలితీరం చేరడంతో ఇద్దరూ పడవ దిగారు. గాలవుడు రెండు కాసులు చేతిలో పెట్టడంతో పడవ నడిపే వ్యక్తి సంబరపడ్డాడు.

అదంతా అరణ్యప్రాంతం. ఆకాశం నిర్మలంగా వుంది. గాలవుడు ఒక చెట్టుకొమ్మను వంచి రెండు కొమ్మలు విరిచి రెమ్మలు, ఆకులు తీసేసి కర్రలుగా చేశాడు. ఒకటి తానుంచుకుని, రెండోది మాధవి చేతికిచ్చి "భద్రతకోసం" అన్నాడు.

గాలవుడి వెనుక మాధవి నడుస్తోంది. ఆమె సుకుమారమైన పాదాలకు ముళ్ళు, మట్టిగడ్డలు గుచ్చుకుని బాధాకరంగా వుంది. ఆగి కాళ్లలో దిగిన ముళ్లు తీసేసుకుంటూ, వెనుకబడుతూ, మళ్లీ వేగం పుంజుకుని అతన్ని చేరుకుంటూ... 'ఇక నేను రాలేనని మొరాయిస్తే ఏం చేస్తాడు?' అనుకుంది కచ్చగా. పుట్టి బుద్ధెరిగాక ఆమె ఎన్నడూ ఇలా కోసులకొద్దీ నడవలేదు.

చాలాదూరం పోయాక "క్షమించు రాకుమారీ, నిన్ను బాగా కష్టపెడుతున్నట్లున్నాను" అన్నాడు.

మాధవి బదులివ్వకపోవడంతో ఆమె కోపాన్ని గ్రహించి కాస్త శాంతపరచాలని కొన్ని సువాసనాభరితమైన చక్కటి పూలను కోసుకొచ్చి "తీసుకో మాధవీ, ఇవి సంపంగి, తెల్ల గన్నేరు, పచ్చ గన్నేరు పూవులు" అంటూ ఇచ్చాడు.

నిజంగానే వాటిని చూడగానే మాధవి మనసు పులకించింది. తీసుకుని కొన్ని జడలో ముడుచుకుని, కొన్నిటిని వాసన చూస్తూ తిరిగి నడవసాగింది. అప్పటికి సాయంకాలం కావడంతో ఉదయంతిన్న పదార్థాలు అరిగిపోయాయి. ఇద్దరికీ ఆకలిగానే వుంది. గాలవుడు దగ్గర్లో కనిపించిన అరటిచెట్లను చూసి పక్వానికొచ్చిన గెలనుండి కొన్ని పండ్లు కోశాడు. అవి తిని మళ్లీ నడక సాగించారు. దారిలో కనిపించిన చెట్లను పరిచయం చేస్తున్నాడు.

మాధవి ఆ పూవులు, కొమ్మల సోయగాలు చూస్తూ నడుస్తోంటే ఒక పెద్దముల్లు పాదంలో దిగబడి రక్తం కారింది. ఓ రాయిమీద కూర్చుని మెల్లగా ముల్లును తీసేసినా రక్తం కారడం తగ్గలేదు.

"అయ్యో... జాగ్రత్త" అన్నాడు గాలవుడు.

ఇంతలో ఒక ఏనుగు కనిపించడంతో మాధవి బెదిరిపోయి, "అమ్మో, అది ఇటే వస్తోంది" అంది.

"భయపడకు, అది మననేమీ చేయదు. ఆ కొలనులో నీళ్ళు

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

తాగాలని వస్తున్నట్లుంది" అన్నాడు.

ఆ మాట నిజమే అయ్యింది. ఏనుగు నీళ్ళు తాగి వచ్చిన దారినే వెళ్ళిపోయింది.

"ఈ అడవిలో పులులూ, సింహాలూ కూడా వుంటాయా?" బిక్కమొహంతో అడిగింది.

"ఆ...వుంటాయి. సాధారణంగా జింకల్ని, ఆవుల్ని తింటాయి"

"అయితే, అవి మనుషులజోలికి రావా?"

"ఆయుష్షు తీరితే వస్తాయి"

మాధవికి కోపం ముంచుకొచ్చింది. 'అసలీ గాలవుడెవరు? నిష్కారణంగా తననెందుకు కష్టపెడుతున్నాడు? అసలక్కడే నేను రాను పొమ్మంటే ఏం చేసేవాడు?' అనుకుంది కోపంగా.

"ఈ దగ్గర్లో ఆశ్రమం ఏమైనా వుందేమో చూసొస్తాను" అంటూ గాలవుడు కుడివైపుకు వెళ్లాడు.

క్రూరమృగాలేమైనా వస్తాయేమోనని భీతిగా చూడసాగింది మాధవి. అంతలోనే విరక్తిగా నిట్టూరుస్తూ 'వస్తే రానీ, పులులు, సింహాలు నయం. క్షణాల్లో చంపేస్తాయి. ఈ కష్టాలు పడేకంటే అదే మేలు' అనుకుంది.

అవ్వ, చారునేత్ర గుర్తొచ్చి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'అమ్మా, ఉద్యానవనంలో చిన్నముల్లు గుచ్చుకుంటే చాలు అంత అజాగ్రత్తేంటని నిష్ఠూరంగా మాట్లాడి, నానా లేపనాలూ రాసేదానివి. అంతటితో తృప్తిపడక రాజవైద్యుణ్ణి పిలిపించి పరీక్ష చేయించి ఔషధాలు ఇచ్చేదానివి. ఇప్పుడు నన్నెవరు పట్టించుకుంటారమ్మా? ఆ ప్రేమా, సానుభూతి ఇంకా నాకు దొరకవుగా... నేత్రా, నువ్వు మాత్రం ఇంత గాయమైతే వూరుకునేదానివా? అల్లాడిపోయేదానివి కాదూ?' అనుకుని కుమిలిపోయింది.

"దయచేసి ఏడవకు మాధవీ, ఇదిగో నీకోసం మూలికలు, ఆకుపసరు తెచ్చాను. లే... కొద్దిదూరంలో ఒక ఆశ్రమం కూడా వుంది. అక్కడికెళ్ళగానే వీటితో నీ కాలికి కట్టు కడతాను, ఆనక విశ్రాంతి తీసుకుందువుగాని" అన్నాడు.

తన నొప్పిని పట్టించుకున్నాడు అనుకోగానే మనసు కొంత ఊరట చెందింది. కన్నీళ్ళు తుడుచుకుని లేచింది. మెల్లగా కుంటుకుంటూ మాధవి నడుస్తోంటే గాలవుడు తినడానికి ఉపకరించే పెద్ద ఆకులు, పండ్లు, కాయలు కోసి చెంగులో వేసుకున్నాడు. చివరికి అరటిదొనెల్లో నీళ్ళు కూడా నింపుకున్నాడు. కొద్దిసేపట్లో ఇద్దరూ ఆశ్రమంలో వున్నారు.

"ఇందులో ఎవరూ లేరా?" అనడిగింది మాధవి.

"ఎవ్వరూలేరు మాధవీ. మునులు తపస్సు నిమిత్తం అనుకూలమైన ప్రదేశాల్లో ఇలా ఆశ్రమాలు నిర్మించుకుంటారు. ఎవరో ముని దీన్ని ఖాళీ చేసి మరోచోటికి వెళ్ళుంటారు" అన్నాడు గాలవుడు.

మాధవి మౌనంగా ఆశ్రమాన్ని వీక్షించింది. కొన్ని మట్టిపాత్రలు, పులి చర్మాలు, చెట్టు బెరళ్ళు వున్నాయి. దాన్ని ఊడ్చి ఎంతో కాలమైందని సూచిస్తూ గాలికి ఎగిరొచ్చిన ఆకులూఅలాలతో నిండి నానా చెత్తగా వుంది.

గాలవుడు తాను తెచ్చినవాటిని ఒక పెద్ద రాతిమీద పెట్టి గబగబా వెళ్ళి దట్టంగావున్న రెండు కొమ్మలు కోసుకొచ్చి వాటితో నేలంతా ఊడ్చి శుభ్రం చేశాడు.

"మాధవీ, ఈ చెట్టు బెరళ్ళున్నాయి చూశావా... ఇవి ఎంతో నేర్పుగా తీసినవి. మహావృక్షాలవి తెగకుండా తీయడం కష్టమే. వీటిమీద



హాయిగా పడుకోవచ్చు, అవసరమైతే కప్పుకోవచ్చును కూడా" అన్నాడు.

'పట్టుపరుపులపై సుఖంగా పవళించిన తాను ఇకపై వీటిపై నిద్రించాలి కాబోలు' అనుకుని "నాకు చాలా అలసటగా వుంది, స్నానం చేయాలనిపిస్తోంది" అంది.

"కాస్త నొప్పి తగ్గనీ, ఆ కొలనులో చేద్దువుగాని"

'ఇకపై వేణ్ణీళ్ళలో అత్తరు వేసుకుని చేసే అదృష్టం లేదుగా' అనుకుంది మరోసారి నీరసంగా.

గాలవుడు గబగబా మూలికలను నూరి, ఆకుపసరుతో కలిపి ఔషధం తయారుచేసి మాధవి పాదానికి రాసి కట్టుకడుతుంటే "అయ్యో, మునివర్యుడివి.. నా కాలు పట్టుకోవడమేమిటి?" అంది జంకుతూ.

గాలవుడు ఆ మాటలు పట్టించుకోక "కాసేపు పడుకుంటే బాధ తగ్గిపోతుంది" అని బయటినుంచి కొంత గడ్డి తెచ్చి నేలమీదవేసి దానిపైన పెద్ద బెరడును పరిచాడు.

మంత్రంవేసినట్లు నొప్పి తగ్గిపోయింది. నేలపైన ఎన్నడూ నిద్రించనందున పడుకోగలనా అని సంశయించింది. కానీ బాగా అలసిపోయివున్న మాధవికి కొద్దిసేపట్లోనే నిద్రపట్టింది. నిద్ర సుఖమెరుగదని సామెతే వుందిగా.

కొలనులో స్నానంచేసి తడితల తుడుచుకుంటూ వచ్చిన గాలవుడికి ఒక పక్కకు ఒత్తిగిలి పడుకున్న మాధవిని చూడగానే మనసు చలించింది. 'ఎంత అపురూప సౌందర్యం ఈమెది? బ్రహ్మదేవుడు ఎంతో శ్రమించి, శ్రద్ధవహించి తయారుచేసినట్లున్నాడు ఈ పుత్తడిబొమ్మని?! మాధవిని గనుక చూడకుంటే అసలు ప్రపంచంలో ఇంత అందం వుంటుందని ఊహించేవాడు కూడా కాదు. ఇప్పటివరకూ స్థిరంగా వున్నానుగానీ ఇక నావల్ల కాదు. నోరూరిస్తున్న పదార్థాన్ని పక్కనే వుంచుకుని తినకూడదనుకుంటే సాధ్యమా? ఎంత మునిపుంగవుడైతే మాత్రం తానూ మనిషే. మాధవి అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. లాభంలేదు, ఆమెని గాఢంగా కౌగిలించుకోకపోతే తనకు మనశ్శాంతి లేదు' అనుకుని మాధవివైపు అడుగులేశాడు.

ఇంకా వుంది.

రాకుమారి మాధవి అందానికి వివశుడైన గాలవుడు ఎంతకైనా తెగించాడా?!

గురుదక్షిణకై వినియోగించుకోవాలని తీసుకెళుతున్న ఆ కన్యతో ఎట్లా ప్రవర్తించాడు?

ఆ అడవిలో వీరి గమ్యం ఎక్కడికి చేర్చింది?

రాబోయే సంచికలో...

క్యాంపస్ ఛాట్

కె శివలీల

దిగులుపడకే సహోదరీ

ఒక్కసారి ఫోన్ రింగయ్యిందో లేదో... టక్కున లిఫ్ట్ చేసిందా అమ్మాయి. హలో... అంటున్న ఆ కంఠంలో ఎంతో ఆతృత. కానీ.... అంతలోనే ఆమె మొహంలో తీవ్ర అసంతృప్తి చోటుచేసుకుంది. ఎందుకంటే....ఆ ఫోన్ తనకి కాదు. వేరే అమ్మాయికి. ఆమె పేరు అనౌన్స్ చేసి ముందున్న చోటే వచ్చి కూర్చుంది దిగులుగా....

రూంలో కూర్చుని చదువుకుంటోందో అమ్మాయి. ఫోన్ రింగయింది. అనౌన్స్ చేస్తున్న పేరు అస్పష్టంగా వినిపించింది. అది తన పేరేనేమో అనుకుంది. "కమింగ్....." అని అరుస్తూ ఉన్నపళంగా పరిగెత్తింది. కానీ అక్కడింకో అమ్మాయి ఫోన్లో మాట్లాడుతూ కనిపించింది. నిరాశగా వెనుదిరిగింది.

నీరసంగా మెస్‌లోకి అడుగుపెట్టిందో అమ్మాయి. ప్లేట్‌లో అన్నీ వడ్డించుకుంది. ఒక ముద్ద నోట్లో పెట్టుకుంది. తానింతవరకూ తిన్న భోజనానికీ, ఇప్పుడు తింటున్న దానికీ ఎంతో తేడా. బలవంతంగా మరోముద్ద తినాలని చూసింది. సహించలేదు. కంచంలోనే చేయి కడిగేసుకుంది.

ఏమైంది వీళ్లకి? ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? దీనంతటికీ కారణం హోం సిక్!

> **అన్నం తినాలనిపించట్లేదు అంటే 'నువ్వు రాకపోతే మేమూ తినం' అని మొండికేసే వాళ్లం. ఎంత ఆలస్యమైనా అందరం కలిసే తినేవాళ్లం. కానీ ఇక్కడ చాలా డిఫరెంట్‌గా ఉంది. ఎవరిదారి వాళ్లది, ఎవరి జీవితాలు వాళ్లవి అన్నట్లుగా ఉన్నారు హాస్టల్ రూమ్మెట్స్. ఎవరితోనైనా మాట్లాడాలనిపించినా డిస్టర్బెన్స్ అనుకుంటారేమోనని భయంగా ఉంటోంది"**

"ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో మేమంతా చాలా స్నేహంగా ఉండేవాళ్లం. ఎవరైనా అన్నం తినాలనిపించట్లేదు అంటే 'నువ్వు రాకపోతే మేమూ తినం' అని మొండికేసే వాళ్లం. ఎంత ఆలస్యమైనా అందరం కలిసే తినేవాళ్లం. కానీ ఇక్కడ చాలా డిఫరెంట్‌గా ఉంది. ఎవరిదారి వాళ్లది, ఎవరి జీవితాలు వాళ్లవి అన్నట్లుగా ఉన్నారు హాస్టల్ రూమ్మెట్స్. ఎవరితోనైనా మాట్లాడాలనిపించినా డిస్టర్బెన్స్ అనుకుంటారేమోనని భయంగా ఉంటోంది" అని ప్రణీత అంది.

"ప్రొఫెసర్స్ ఎప్పుడూ కోపంగా ఉంటూ విద్యార్థులపై చిర్రుబుర్రులాడుతూ ఉంటారేమో అనుకునేదాన్ని. కానీ అవన్నీ నా అపోహలే అని తేలింది. మా ప్రొఫెసర్స్ చాలా స్నేహంగా ఉంటున్నారు. ఏ విషయం అర్థం కాకపోయినా చాలా బాగా చెబుతున్నారు. ఇటువంటి స్నేహపూరిత వాతావరణం నాలో చాలా ఉత్సాహాన్ని నింపుతోంది. ఇంటి ధ్యాస లేకుండా చేస్తోంది. కానీ హాస్టల్‌లో మాత్రం ఎవరూ అంత దగ్గరగా మాట్లాడట్లేదు. సీనియర్స్ కొంతవరకూ బాగానే మాట్లాడతారు. ఎంతైనా డిగ్రీ చదివేటప్పటి స్నేహానికున్నంత చనువు, చొరవ ఇప్పటి స్నేహంలో లేదనిపిస్తోంది" అని దేవి అంది.

"నేను హాస్టలుకొచ్చిన కొత్తల్లో చాలా దిగులుగా అనిపించేది. అన్నం సహించేది కాదు. క్లాసులోనూ డల్‌గా ఉండేదాన్ని. అది గమనించిన మా మేడం ఓ రోజు నన్ను పిలిచి 'మీ మమ్మీ వాళ్లు గుర్తొస్తున్నారా. ఇంటికెళ్లాలనిపిస్తోందా? నేనూ మీ అమ్మలాంటి దాన్నే కదా. నీకే సమస్యలున్నా నాతో చెప్పు. అందరితో స్నేహంగా మాట్లాడు. అంతేగానీ ఇలా ఎప్పుడూ ఇంటి గురించి ఆలోచిస్తుంటే చదవలేవు' అని నాకు ధైర్యం చెప్పారు. ఆ తరువాతే నేను హాస్టల్ వాతావరణానికి అలవాటు పడ్డాను" అని కామర్స్ విద్యార్థిని హేమ అంది.

మీకూ ఏ కాస్త సమయం దొరికినా అమ్మానాన్నలే గుర్తొస్తున్నారా? అయితే వీలైనంత వరకు అందరిలో ఉండడానికి ప్రయత్నించండి. లైబ్రరీలో ఎక్కువగా గడపడం అలవాటు చేసుకుంటే... పుస్తకాలుకు మీకు మంచి నేస్తాలవుతాయి. అప్పుడిక ఒంటరితనం మిమ్మల్నేడిపించదు మరి!

లేకపోతే మీరు మూడీగా ఉంటే మీ ఫ్రెండెవరైనా చూశారనుకోండి...''దిగులు వడకే నహోదరీ...'' అని పాటందుకున్నారనుకోండి...ఏం చేస్తారు మీరు?! అప్పటికీ మీరు మీ ఇంటి బెంగనుండి తేరుకోకపోయారో...మిమ్మల్ని మీరే ఈ పాటలో చూసుకోవాలి. పోల్చుకోవాల్సివస్తుంది మీ ఇష్టం మరి!

"చదువు లేదు...సంధ్యలేదూ...డిగ్రీయే రాదూ...
బెంగతోటి బెంబేలెత్తి బ్యాగు సర్దితే... బాడ్ బ్యాడేనూ" ✤



“ఆకలేస్తుంది నాన్నా” అంటున్న కొడుకుతో మతి చలించిన కానిస్టేబుల్‌గా సుత్తివేలు “ఆగు.... మన ప్రధానమంత్రి విదేశీ అప్పుకి వెళ్ళాడు. రాగానే వండి పెడతాను” అన్న డైలాగుతో “ప్రతిఘటన” సీన్ గుర్తొస్తుంది హాస్యంలో విషాదాన్ని... విషాదంలోంచి హాస్యాన్ని స్ఫురణకు తేగల ఓ మంచి నటుడు మన సుత్తివేలు. ఈ వారం కూడా తన సినిమా విశేషాలు చెబుతున్నారు...

మురళి పెండ్యాల

“విషాదం నాకు... సంతోషం మీకు...”

కామెడీ నుంచి సీరియస్ పాత్రవైపు మొగ్గుచూపడం నే కోరుకున్నది కాదు. ‘ఈ పిల్లకు పెళ్ళవుతుందా?’ ‘ఈ చదువులు మాకొద్దు’.. వంటి చిత్రాల్లో దర్శకులు వేజెళ్ళ విలన్‌టచ్‌తో కూడిన పాత్రలిచ్చారు. తర్వాత టి.కృష్ణ ఉద్వేగంతో కూడిన సీరియస్ వేషాలిచ్చారు. ముత్యాల సుబ్బయ్య హీరోయిన్ల తండ్రిగా వేయించారు. ‘కలికాలం’తో నన్ను తాతయ్యగా ప్రమోట్ చేశారు. ఇలా కాలక్రమేణా వచ్చిన మార్పే. దీనివల్ల ఆర్థికంగాకూడా ఇబ్బందికి గురయ్యాను. ఎందువల్లనంటే ఏ వేషమిచ్చినా నే చేస్తానని చెప్పినా, నన్ను మాత్రం గిరిగీసి అక్కడికే పరిమితం చేశారు. రిటైర్డు టీచర్‌గా, పోస్టుమ్యాన్‌గా... ఇలాంటివే వేశాను. మళ్ళీ అటువంటి పాత్రలుంటేనే అవకాశాలన్నమాట...

నష్టపోయాను

నేను చేసిన కొన్ని పొరబాట్లే ఈ నష్టానికి కారణమంటాను.. నేనుగా ఏనాడూ పాత్రలు అడక్కపోవడమే నేను చేసిన పొరబాటు. మంచి పాత్రలు వెయ్యాలనే ఉద్దేశంతో అడగలేదు. వాళ్ళిచ్చినవే చేశాను. అలా నా కెరీర్ నాకు తెలీకుండా పలు మార్పులకు లోనయింది.

ఏదీ ఆనాటి వాతావరణం?

ఉమ్మడికుటుంబాల రోజుల్లో కుటుంబసభ్యుల మాదిరిగా ఆనాడు తోటి నటీనటులు మెలిగేవారు. ఫలానా పాత్రకు ఇతనయితే బాగుంటుందని సినిమాతీసే నిర్మాతకు, దర్శకుడు చెప్పే సమైక్యత ఆనాడు ఉండేది. ఆ వ్యక్తి కనబడినా, లేదా ఫోన్లో అయినా “నీ పేరు ప్రస్తావన వచ్చింది. ఒకసారి వెళ్ళికలు” అని ప్రోత్సహించేవారు. నేడది లేదు. ప్రతిరంగంలో ఉన్నట్లే సినిమారంగంలోనూ వ్యక్తిగతం అగ్రస్థానంలో ఉంది. తమ పొట్టనిండిన తర్వాత పక్కవాడి పరిస్థితి ఆలోచిద్దామనే కొందరైతే, రికమండ్‌చేస్తే అసలుకే మోసం వస్తుందని భయపడేవాళ్ళు కొందరు. పరిస్థితులు అనుకూలించకపోతే ఏమీచేయలేం. ఇప్పుడు కొత్తగా నడుచుకోవాలంటే నావల్ల కావడంలేదు.



రూపాయి అంటే అర్ధరూపాయి అనేవాళ్ళున్నారు

పెర్‌ఫ్మారెన్స్‌కు తగినట్లు క్యారెక్టర్ వచ్చినా చేసేందుకు తగిన అవకాశం లేకుండాపోతోంది. తనకుతాను సర్వైవల్ అవడంకోసం దర్శకుడు పడరాని పాట్లుపడుంటారు. కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ రీత్యా ఫిలిం, టైమ్ వేస్ట్ అవుతున్నాయనే భయంతోదర్శకులు హడావుడిగా ముగిస్తున్నారు. స్పీడ్‌యుగంలో పరుగెత్తలేక నాలాంటివాళ్ళు చాలా మందిది ఇదే స్థితి. తృప్తిగా రాలేదని సలహాఇచ్చినా పట్టించుకునేవారు లేరు. ప్రతీవారు ఆర్థికపరంగా ఆలోచిస్తున్నారు. నేను రూపాయికి ఒప్పుకుంటే దాన్ని అర్ధరూపాయికి చేస్తామనేవారు ఉన్నారు. గట్టిగా అడగలేం. డిమాండ్ ఉన్నంతకాలం బాగానే ఉంటుంది. ఏమాత్రం తగ్గినా కొత్త ఆర్టిస్టు ఆ ప్లేస్‌లో వచ్చేస్తాడు. మళ్ళీ ఆ కొత్తవారు పుంజుకొని ముదిరితే మరో కొత్తనటుడు ఉద్భవిస్తాడు. ఇదొక చక్రం.

ఈ విషయంలో సీనియర్స్‌కే తప్పని కష్టాలు

లోగడ కాంతారావుగారు నటించే ఓ చిత్రంలో రాజశ్రీ కథానాయిక. సినిమా అంతా పూర్తయి ఓ పాట మిగిలి ఉంది. ఆ సినిమా తాలూకా డబ్బులు ఆయనకు పూర్తిగా ముట్టలేదు. ఈనాడు ఉన్నట్లే ఆనాడూ హీరోలు సినిమా చివరలో బెట్టుబోయేవారు. అలా కాంతారావుగారు సినిమాలోని పాట చిత్రీకరణ టైంలో భీష్మించి కూర్చున్నారు. మేకప్ అంతా వేసుకుని షాట్‌రెడీ అనగానే కో-డైరెక్టర్ వచ్చినా ఆయన వెళ్ళలేదు. ఆ తర్వాత ఈయన చేతి గడియారం పరుగెడుతూనేఉంది. సాయంత్రంవరకూ అలానే కూర్చోబెట్టారు. అదేమని అడిగితే వేరే షాట్ తీస్తున్నారు, మేనేజర్‌గారు వస్తున్నారంటూ కాలయాపన చేయించారు. ఆరోజు ఆయన తిరిగి ఇంటికి వెళ్ళారు. కొద్దిరోజుల తర్వాత మళ్ళీ పిలుపు వచ్చింది. ఈసారి సినిమా షూటింగ్‌కు కాదు. ప్రివ్యూచూడ్డానికి రమ్మని. ఆశ్చర్యంగానే వెళ్ళినాయన తనపై తీసిన పాటను చూసి నిశ్చేష్టుడయ్యారు. ఆయన చేయని పాటను చక్కగా మేనేజ్‌చేసి తీయడం అందులో ప్రత్యేకత. పాట పాడేప్పుడు క్లోజ్‌లో ఆయన ఫేస్ చూపించడం మిగతాదంతా రాజశ్రీ నృత్యంపై చక్కదిద్దడం అందులోని విశిష్టత. అందుకే చాలామంది నటీనటులు చేతికి వచ్చిందే చాలనుకుని తృప్తిపడుతున్నారు.

ఆలస్యమయిందని

చెన్నై నుంచి హైదరాబాద్ రావడం ఆలస్యం చేశానని చాలామంది అన్నారుకానీ... దానికి పరిస్థితులు అనుకూలించకపోవడం ముఖ్యకారణం. పిల్లల చదువులు ప్రధాన కారణం. వారిని మాటిమాటికీ ఆ ఊరు ఈ ఊరు తిప్పడం వల్ల చదువులకు భంగం కలగడం ఇష్టముండక, ఒకస్థాయి వరకు వచ్చాక వద్దామనే ఆలోచించాను. ప్రస్తుతం ముగ్గురు పిల్లలూ చేతికివచ్చారు.

జలపాతాల్లాంటి కథల్లేవు

ఓ స్త్రీ విద్య నేర్చుకుంటే ఇల్లంతా విజ్ఞాన నిలయం అన్నట్లే రచయిత చక్కని కథను అందిస్తే సమాజానికి మంచి చేసినంతపని. నేడు వారంతా ఎథిక్స్ లేకుండా రాస్తున్నారు. అదేమంటే దర్శక నిర్మాతలు రాయమంటున్నారనే సమాధానం. ప్రేక్షకులే కోరుకుంటున్నారనే రెస్పాన్స్ నిర్మాతలది. రామాయణంలో ఏకపత్నీవ్రతుడు, శీలవతి, పతివ్రత.. పదాలనే మార్చేస్తూ రెండో కోణంలో చూపిస్తున్నారు. ప్రకృతి మనకిచ్చిన పరిశుభ్రమైన నీటిని రకరకాలుగా మురికి చేస్తున్నాం. కొండలు కోనల వెంట పొర్లుకుంటూ జలజలా పారుతున్న జలపాతాల్లాంటి కథలు, పాత్రలు సృష్టించాల్సింది రచయితలే. ఆ నీరు మురికిగాకుండా పర్యవేక్షించే బాధ్యత దర్శక నిర్మాతదే. ✤

(వచ్చేవారం కబుర్లు వి.బి. రాజేంద్రప్రసాద్‌తో...)

వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో తెలుసా! అవునర్రా! ఈమె దేశంకోసం ఆంగ్లేయులతో పోరాడి తన ప్రాణాలను సైతం పణంగా పెట్టింది.

ఏంటి తెలిసిపోయిందా! మాకు తెలుసు. మీరు ఇట్టే పసిగట్టేస్తారని. మరి ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే యమ అర్జంటుగా కార్డు తీసుకుని జవాబు రాసేసి మాకు పోస్ట్ చేయండి. ఓకేనా. ఈ పని ఇవాళే ఇప్పుడే చెయ్యాలని తెలుసుకదా. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

బాలనేస్తాలు



31.7.05 కు సరైన సమాధానం రాసినవారు

ఎమ్.గోదారెడ్డి, ఇబ్రహీంపట్నం. ఎ.నాగమోహన్ సాయి, స్వతంత్ర నగర్, మధురవాడ. పి.వంశీపవన్ (10), శ్రీ ఆదిత్య పబ్లిక్ స్కూల్, ఒంగోలు. మట్టపర్తి భారతి (5), తెలుగోడుపాలెం, తూ.గో. పి.శ్రీదేవేష్, భీమిలి, విశాఖ. కె.నాగనీరజ (9), శివనాగప్రణీత్ (7), తూబాడు. జి.సాయిభరత్‌రెడ్డి (7), మోదుకూరు, గుంటూరు. జె.కనకలక్ష్మి (10), పెళ్ళకూరు, నెల్లూరు. కె.సరస్వతి (10), నాయుడుపేట, నెల్లూరు. కాకినాడ కిరణ్‌కుమార్ (10), డోలపేట, రాజాం. నిశాంత్‌రాయ్ (5), పొన్కల్, ఆదిలాబాద్. పక్కిసాయిభరద్వాజ్(3), గరివిడి. ఎం.డి.వశీంసుల్తాన్(3), కందుకూరు. టి.మహతివైష్ణవి (9), వనస్థలి పురం, హైదరాబాద్. దుస్సా అనన్య గాయత్రి (2), జనగామ. ఎమ్.శశికళ (4), బ్రాహ్మణ చెరువు, పెనుమండ్ర, ప.గో. ఎ.సాహిత్యలోహిత (4), ఎ.శరత్‌చంద్ర (2), పాలకొల్లు. బి.జయలక్ష్మి (6), జడ్‌పిహెచ్ స్కూల్, అనంతవరం, గుంటూరు. ఎమ్.క్రాంతి (8), నవభారత్‌స్కూల్, అద్దంకి. ఎమ్.శాంతి (4), నేతాజీ నికేతన్ స్కూల్, అద్దంకి. కె. శ్రీతన్మయ(3), బ్రాడీపేట, గుంటూరు. తన్నీరు ఖన్నా విజయ్ (10), జవహర్‌నవోదయ విద్యాలయం, తన్నీరు సాయిరాజేష్ (6), బాలవిద్యానికేతన్ స్కూలు, కల్లూరు, ఖమ్మం. ఎమ్.సబియా(8), బండిమెట్ట, కర్నూలు. యు.యు.బాబు నరేంద్రప్రసాద్ (8), ఎం.షబ్బీర్ హుస్సేన్ (10), యు.భీమలింగ (10), టి.ఎమ్.డి. నాసిర్ (10), ఆర్.పి.రంజాన్ (10), డి.రిహానాభాను (10), పి.విజయ మాధవి (10), ఎ.సుమలత (10), బి.గౌతమి (10), సి. నాగరత్న (10), యు.ఈరన్న (10), యు.రాజశేఖర్ (10),యస్.కవీంద్రరెడ్డి (10), ఎమ్. ప్రసాద్ (10), బి.రవి (10), యం.తిమ్మప్ప (10), బి.శ్రీనివాసులు (10), యం.బాలాజీ (10), యం.అప్రేష్ (10),కె. విజయకుమార్ (10), కె.యం.యాసిన్ (10), కె.మజార్ హుస్సేన్ (10),బి.నరసింహులు (10),యం.అనుదీప్ (10), యు.యం.అనిల్ (10), యు.యస్. అనిల్‌కుమార్ (10), వి.మంజునాథ్ (10), జి.విజయ్ ప్రకాశ్ (10), యు.యం.డి.నాసిర్ (10), బి.రవితేజ యాదవ్(10), జి.నాగేష్(10), యం.రమేష్(10), జి.సునంద పవన్(10), శ్రీ వేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు.

7.8.05 సమాధానం:
పింగళి వెంకయ్య

రంగులు అద్దేద్దాం

హేయ్ం!

చిన్నారులూ... ఏంటి అటూ ఇటూ చూస్తున్నారు? నేనర్రా! అప్పూని. బొమ్మలో కనిపిస్తున్నా! నామీద నా ఫ్రెండ్ టమోటా వుంది. మేమిద్దరం కలిసి షికారుకెళుతుంటే మాకు ఓ ఐడియా వచ్చింది. అదేంటంటే... మాకు ఆర్టిస్టు అంకుల్ రంగులు అద్దలేదుకదా. మీరైనా వేస్తే బాగుంటుందని. మరి వేసేస్తారుగా. బైబై.



త్రికోణాలు ఎన్నో!

పిడుగులూ...! పైన ఒక పెద్ద త్రికోణం వుందికదా. అందులో బోలెడన్ని చిన్న త్రికోణాలున్నాయి. అవి మొత్తం ఎన్నో చెప్పండి చూద్దాం.

జవాబులు

మొత్తం పక్షులు ఎన్ని?
పదిహేను

తేడాగా వున్నదెవరు?
7వ నెంబరు అమ్మాయి.

త్రికోణాలు ఎన్నో!
మొత్తం నలభైఏడు.

మొత్తం పక్షులు ఎన్ని?

నేస్తాలూ! పైన ఒక చక్కటి ప్రకృతి దృశ్యం వుందికదా. అందులో పిల్లలు ఎంచక్కా ఆడుకుంటున్నారు కదూ. కానీ ఇందులో తమాషా విషయం ఒకటుంది. అదేంటంటే... ఈ బొమ్మలోనే కొన్ని పక్షులు దాగి వున్నాయి. ఏంటి అలా ఆశ్చర్యపోతున్నారు. నిజ్జంగా. అవి ఎక్కడెక్కడ వున్నాయో, ఎన్ని వున్నాయో కనిపెట్టాల్సింది మాత్రం కేవలం మీరే. సరేనా!



తేడాగా వున్నదెవరు?

బుజ్జాయిలూ...! పైన కొందరు పిడుగులు చక్కగా ముస్తబయ్యారు. ఫ్రెండు పుట్టినరోజు పార్టీకి వెళ్లడం కోసం అంతా ఒకేలా తయారవ్వాలని అనుకున్నారు. అయ్యారు. కానీ వీరిలో ఒక్కమ్మాయి మాత్రం కాస్త తేడాగా వుంది. ఆ పాప ఎవరో మీరు చెప్పాలి.

'ఏంటి? మాకెలా తెలుస్తుంది?' అన్నట్టు చూస్తున్నారు. మీరు కాబట్టే కనిపెట్టగలరర్రా! ఎందుకంటే మీకు పరిశీలనాదృష్టి ఎక్కువకదా. అందుకన్నమాట.

ముందు మీరు ఒక్కొక్క పాపను చూడండి. ఏదైనా తేడా వుంటే గుర్తించండి. అంతే. సింపుల్ కదా.

చిన్నారి చిత్రకారులు

ఆర్. విజయకాంత్,
5వ తరగతి,
సెయింట్ ఇగ్నాటిస్ హైస్కూల్,
ఎబి.పాలెం.



చర్లంచర్ల నాగలక్ష్మి,
10వ తరగతి,
ఎం.ఆర్.కె.జెడ్.పి.హెచ్.స్కూల్,
వీరవాసరం, ప.గో.

అట్టమీది కథ

కె శివలీల



గురజాడవారి కన్యాశుల్కం నాటకంలో, మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందంటే..."అవుతే...మన ఊరి హెడ్డు కానిస్టేబు మారతాడా" అని జట్కావాడు అడిగాడని ది గ్రేట్ గిరీశంగారు శలవిచ్చారు. జట్కాబండి వాడు అమాయకంగా అడిగినట్లు అనిపించినా వచ్చే స్వాతంత్ర్యఫలం మనకెట్లా అందుతుంది అనడిగినట్లుగా ఉంటుంది. అదే తీరులో ఈ దేశానికి స్వాతంత్ర్యమొచ్చిందంటే ఎవరి బతుకులెలా ఉన్నాయని తరచి చూసుకోవడం కూడా న్యాయమైందే మరి! మనం రేపు యాభైఏడో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్నాం కదా...అందుకే ఆ పోరాటంలో పాలుపంచుకున్న మహిళామణుల గురించి స్వాతంత్ర్యంలో మహిళలు పొందిందెంతో, పొందనిదెంతో కూడా తెలుసుకుందాం.



స్వాతంత్ర్యం కోసం మేం కూడా...

"ఆడపిల్లంటే అణిగిమణిగి ఉండాలి. ప్రతిదానికీ సర్దుకుపోవాలి. కానీ ఇదేంటి మగరాయుడులా ఎదురుప్రశ్నిస్తోంది" అని నోరునొక్కుకుందో బామ్మ... తనకో రూలు, తమ్ముడికో రూలు ఎందుకని ప్రశ్నించిన మనవరాలిని చూస్తూ...

"అమ్మాయిలకు టీచర్ ఉద్యోగాలైతే బాగుంటాయి. ఇదిలాంటి ఉద్యోగం చేస్తానంటుందేంటి? అసలు దీనికి చదువెందుకు? ఏం అవసరంలేదు. ఇంట్లోనే ఉండమను. పెళ్లిచేసేద్దాం" అని మండిపడ్డాడో తండ్రి ఫ్యాషన్ డిజైనరవుతానంటున్న తన కూతురి మాటలకు.

"అమ్మాయి ఎంబిఎ మార్కెటింగ్ చేసిందా? ఏంటీ...ఉద్యోగం చేయాలనుకుంటోందా? పెళ్లైన తరువాత ఉద్యోగం చేయడానికస్సలు వీల్లేదు. ఆడపిల్లలను బయటికి పంపించడం మా ఇంటా వంటా లేదు" అంటోందో కాబోయేఅత్తయ్య. సంప్రదాయ ముసుగులో కాబోయే కోడలిపై తన ఆధిపత్యాన్ని చలాయిస్తూ...

"నువ్వింకా ఉద్యోగం చేయడం అవసరమా...? నేను సంపాదించట్లేదా చెప్పు. నువ్వు ఇంట్లో పిల్లలని పెంచడంలో శ్రద్ధ చూపిస్తే బాగుంటుందేమో" అని అంటాడో భర్త తనకన్నా ఎక్కువ సంపాదిస్తున్న భార్యతో...

ఈ పై విధంగా ఆలోచించేవారి ఉద్దేశ్యంలో....అమ్మాయంటే ఏ మాటకీ ఎదురు చెప్పకూడదు. వంటింటికే పరిమితమవ్వాలి. సాదాసీదా ఉద్యోగాలే చేయాలి.. అందులోనూ భర్తకన్నా తక్కువ జీతమే సంపాదించాలి. ఎన్నో "ఆగష్టు పదిహేనులు" అలాఅలా జరిగిపోతున్నా చాలామంది ఇలాగే ఆలోచిస్తున్నారు, ఇలాంటి వైఖరినే అనుసరిస్తున్నారు.

మనకు స్వాతంత్ర్యం వచ్చి నేటితో 57 ఏళ్లు



పూర్తయ్యాయి. స్వాతంత్ర్య సంగ్రామంలో పురుషులతోపాటు మహిళలూ పోరాడారు. ఫలితంగా 200 సంవత్సరాలు బ్రిటీషు వారి ఆధిపత్యంలో కట్టుబానిసల్లా బతికిన మనం స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటున్నాం. దీనిలో మహిళలూ భాగస్వామ్యులే. కానీ వారు నిజంగా స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారా? అని ఎవరిని ప్రశ్నించినా జవాబివ్వడానికి క్షణకాలమైనా ఆలోచిస్తారు. ఆ తరువాత మౌనమే సమాధానమౌతుందేమో...

స్వాతంత్ర్యం వచ్చిన తరువాతే మహిళల పరిస్థితిలా ఉంటే.... అంతకుముందు ఇంకెలా ఉండేది? ఆ రోజుల్లో మహిళలపై తీవ్రమైన ఆంక్షలుండేవి. వారిని వంటింటికి, బిడ్డలను కనటానికి మాత్రమే పరిమితం చేసేవారు. అటువంటి గడ్డుపరిస్థితుల్లోనూ తమ కట్టుబాట్లు తెంచుకుని, పరదాలు దాటుకుని ఎందరో మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.

ఏ స్ఫూర్తి వారిని ముందుకు నడిపించింది? ఏ చొరవ వారినీ మహోన్నత సంగ్రామంలో భాగస్వామ్యులను చేసింది? దీని సమాధానం ధైర్యమని, సామాజిక స్పృహని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఇదే వారిలో దాగిన ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసింది. ఎంతటి త్యాగానికైనా సిద్ధపడేట్టు చేసింది. తుపాకీ కాల్పులకి ఎదురొడ్డేట్టు పురికొల్పింది. ఎన్నో భీకర పరిస్థితుల్లోనూ ముందడుగేయడానికి తోడ్పడింది. మనమీనాడు స్వేచ్ఛావాయువులను పీలుస్తున్నామంటే... దాని వెనుక స్త్రీల హస్తమూ ఉంది.

వారి సహాయమే లేకుంటే....

వీధుల్లోకెళ్లి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేవారు కొందరైతే... ఇంట్లోనే ఉంటూ ఊహించలేని త్యాగాలు చేసినవారు మరికొందరు...అర్ధరాత్రి ఇంటికొచ్చిన అజ్ఞానవీరులనాదరించి, కన్నతల్లిలా కాపాడిన వారెందరో... పోలీసుల దమనకాండకు తలవంచక, భయపడక ఆ మాతృమూర్తులు అందించిన సేవలు మరుపురానివి. ఇలాంటి త్యాగాలు జాతీయపోరాటంలోనూ, గాంధీజీ నాయకత్వాన జరిగిన సత్యాగ్రహాలలోనూ, తెలంగాణా సాయుధ పోరాటంలోనూ అడుగడుగునా కనిపిస్తాయి. వారి సహాయమే లేకుంటే... వారు త్యాగం చేయకుంటే అంతటి ఉద్యమాలు నడిచేవేకావని నిస్సందేహంగా చెప్పొచ్చు.

తొలి మహిళా ఖైదీ....

కాంగ్రెస్ వాలంటీర్లకు భోజనం పెట్టిందన్న కారణంతో కాట్రగడ్డ తులశమ్మగారిని అరెస్టు చేసింది బ్రిటీషు ప్రభుత్వం. తాను చేసింది తప్పనీ, క్షమించమనీ లిఖితపూర్వకంగా అభ్యర్థిస్తే...వదిలేస్తామని పోలీసులన్నారు. "వేళకు ఇంటికి వచ్చిన వారికి అన్నం పెట్టడం భారతీయ సాంప్రదాయం. నేను తప్పు చేయలేదు. చేయనిదానికి క్షమాపణ అడగడమేంటి?" అని ఎదిరించారావిడ. ప్రభుత్వం ఆమెను 'సి' క్లాసు జైల్లో వేసింది. ఆమె తలవంచలేదు. ఆంధ్రలో తొలి మహిళా ఖైదీ ఈమే కావచ్చునని భావిస్తున్నారు.

బతికుండగానే శవాలగదిలో...

1932 శాసనోల్లంఘన ఉద్యమంలో పోలీసుల లాఠీఛార్జీలకు అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు తీవ్రంగా గాయపడ్డారు. వీరికి తన ఇంట్లో ఆశ్రయమిచ్చారు కాట్రగడ్డ రామసీతమ్మ. కోలుకునేంత వరకూ సేవచేశారు. ఫలితంగా బ్రిటీషు ప్రభుత్వం 1932 జనవరి 1వ తేదీన ఈమెకు కఠినశిక్ష, రు. 400 జరిమానా విధించింది. రామసీతమ్మగారు జరిమానా చెల్లించడానికి నిరాకరించారు. ఆమె ఇంట్లోని సామానంతా, అట్లపెనం సహా వేలమేశారు. అయినా జరిమానా మొత్తం రాలేదు. చివరికి చేతిగాజులూ లాక్కున్నారు.

వెల్లూరు జైలులో శిక్ష అనుభవిస్తుండగా...అకస్మాత్తుగా ఆమెకు పక్షవాతం వచ్చింది. పరిస్థితి విషమించింది. బ్రిటీషు వారు ఆమె చనిపోతుందనుకున్నారు. బతికుండగానే శవాల గదిలో పడేశారు. మూడురోజుల తరువాత ఆమె తిరిగి కోలుకున్నారు. జైలుశిక్ష పూర్తిగా అనుభవించిన తరువాత విడుదలయ్యారు. హరిజన నిధికి బంగారు గాజులు, ఉంగరంతో సహా రు. 1300లు నగదును గాంధీజీకి స్వయంగా సమర్పించారు. 1933లో దత్తత పుత్రుడు మధుసూధనరావు సహపంక్తి భోజనాలను ఏర్పాటుచేశారు. ఆ చర్యకు వీరిని బంధువులంతా బహిష్కరించారు. దీన్ని లక్ష్యపెట్టక దత్తత కుమారుని పక్షాన ధైర్యంగా నిలబడ్డ ఆదర్శమహిళ. ఈవిడ 1973 సెప్టెంబరు 4న చనిపోయారు.

అర్థరాత్రి ఒంటరిగా...

1931...విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమం ఊపందుకున్న రోజులు...

దీనిలో భాగంగా విదేశీ దుకాణాలముందు అనేకమంది మహిళలు పికెటింగ్ చేస్తున్నారు. దీనిలో పాలడుగు వరలక్ష్మమ్మగారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈవిడ గన్నవరం తాలూకా గురజాడ వాస్తవ్యులు. బ్రిటీషు సైనికులు వీరందరిపై బురదనీళ్లు, రంగునీళ్లు చల్లారు. దాంతో వరలక్ష్మమ్మ గారు స్పృహతప్పి పడిపోయారు.

ఒకసారి ఆమెను 1932 మార్చి 27న కృష్ణాజిల్లా ఉయ్యూరులో అరెస్టు చేశారు. అటునుంచి బందరు తీసుకెళ్లి లాకప్‌లో ఉంచారు. ఆమె దగ్గరున్న డబ్బు తీసుకుని అర్థరాత్రి వదిలేశారు. తిరిగి ఈవిడ గుడివాడ చేరుకున్నారు. ముదునూరు తిరునాళ్లలో కాంగ్రెస్ జెండా ప్రతిష్ఠాపన చేశారు. బ్రిటీషు వారామెను మళ్లీ అరెస్టు చేసి నూజివీడులో వదిలేశారు. ఆ తరువాత ఆమెను అరెస్టు చేసి గుడివాడు సబ్‌జైలులో నాలుగు రోజులు, కైకలూరు సబ్ జైలులో నలభైఐదు రోజులుంచారు. అప్పటికి ఈవిడ ఆరుమాసాల గర్భిణి. ఈమెకు ఆరు మాసాల కఠిన కారాగార శిక్ష, రు. 100 జరిమానా విధించారు. డబ్బు చెల్లించడానికీవిడ నిరాకరించారు. ఫలితంగా రాయవెల్లూరులో ఏడు మాసాల కఠిన శిక్షనుభవించారు. శిక్షాకాలంలోనే ఆడపిల్లను ప్రసవించారు. ఆ బిడ్డే ఇప్పటి యలమంచిలి వెంకాయమ్మగారు. వరలక్ష్మమ్మగారు 1948లో మరణించారు. ఇలా అనేక పట్టణాలు, గ్రామాలలో అసమాన త్యాగాలు, ధైర్య సాహసాలు చూపిన తెలుగు తల్లి ముద్దు బిడ్డలెందరో ఉన్నారు. చరిత్ర కెక్కిన వారు కొందరైతే అజ్ఞాతంగా ఉండిపోయిన వారెందరో మహిళామణులున్నారు.

జైళ్లలోనూ పోరాటాలే....

స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేస్తున్న మహిళలని బ్రిటీషు వారు

అరెస్టు చేసి జైల్లో వేసేవారు. అయినా మన వారు ఊరుకునేవారా? అక్కడా పోరాటాలు చేసేవారు. ఇది బ్రిటీషు వారి గుండెల్లో రైళ్లు పరిగెట్టించింది. దీనికి ప్రధానసూత్రధారి ఎవరో గుర్తించారు. వెంటనే ఆ నాయకురాలిని మధురైకి పంపారు. అక్కడామె ఒంటరిగా కారాగార శిక్షననుభవించారు. ఇలా బయటే కాకుండా... జైల్లో ఉన్నప్పుడూ బ్రిటీషువారి కంటికి కునుకులేకుండా చేసిన మహిళ ఎవరనుకున్నారు? మన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ గారు.

ఒక రోజు... మద్రాసు బీచ్‌లో బులుసు సాంబమూర్తిగారిని బ్రిటీషు పోలీసులు లాఠీలతో కొడుతున్నారు. "మా నాయకుణ్ని కొట్టొద్దు. నన్ను కొట్టండి." అని దుర్గాబాయి గారు అడ్డుపడ్డారు. ధైర్యంగా లాఠీదెబ్బలు తిన్నారు. ఆ ఘటన మరుపురాని దృశ్యం. ఎందరో స్త్రీలు అనేక చిత్రహింసలకు గురయ్యారు. జైళ్లకు వెళ్లారు. వీరిని పోలీసులు అర్ధరాత్రి వేళ ఊరిచివర వదిలేసేవారు. అసభ్యమైన భాషతో అవమానపరిచేవారు. పందిమలం, కారం కలిపిన నీళ్లు ముఖాలపై చల్లేవారు. మద్యపాన విక్రయ శాలల ముందు పికెటింగ్ చేస్తున్న మహిళల నెత్తిపై ముంతలతో కల్లు గుమ్మరించేవారు. ఈ చర్యకు కొందరు మహిళలు అక్కడికక్కడే స్పృహకోల్పోయే వారు. వీళ్లే కాదు చరిత్రలో కొంచెం వెనెక్కి వెళితే మనల్ని ఉత్తేజపరిచే మహిళామణులనేకమంది కనకబడతారు. ఒక్కసారి అటుకూడా వెళదాం రండి.

వీరనారి

ఆమె 23 సంవత్సరాల యువతి... 5 సంవత్సరాల బిడ్డను వీపున కట్టుకుంది. బ్రిటీషు సైనికులతో వీరోచితంగా పోరాడుతూ 60 మైళ్లు గుర్రంపై ప్రయాణం చేస్తోంది. ఎదురైన ఆంగ్లసైనికులను హతమారుస్తోంది. శరీరమంతా గాయాలయ్యాయి...ఒళ్లంతా రక్తసిక్తం...అయినా ఆమె ఏ మాత్రమూ వెనక్కు తగ్గలేదు. వీరోచితంగా పోరాడుతోంది. జనరల్ జాకర్‌ని ఓడించింది. ఆఖరిదశలో నేలకొరిగిపోయింది. ప్రాణాలుండగా బ్రిటీషు వారి చేతులకు చిక్కకూడదని ఆత్మార్పణ చేసుకుంది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆమె... ఝాన్సీ కి రాణి...ఝాన్సీ లక్ష్మీబాయి.

ఆ మగవేషాల్లో ఉన్నవారెవరు?

లక్ష్మీబాయికి ఇద్దరు అంగరక్షకులుండేవారు. ఆమె ఎక్కడికెళ్లినా వీరూ ఉండేవారు. వీరు నిజంగా మగవారేనా? కాదు. ఆ రూపంలో ఉన్న యువతులు. ఆ ఇద్దరిలో ఒకరు ముందర్. ఈవిడ ముస్లిం మహిళ. ఏ సమయంలోనైనా ఈమె రాణి వెన్నంటే నీడలా అనుసరించేది. కొఠా కి సరాయి ప్రాంతంలో రాణితో పాటు ఈమెకు తుపాకీ గుండ్లు తగిలాయి. వీరిరువురూ ఒకేసారి నేలకొరిగారు అని రాబర్ట్ హెమిల్టన్ తన లేఖలో పేర్కొన్నారు.

ఎవరావిడ?

యుద్ధం ప్రారంభమైంది...తెల్లవారు మాదే విజయమని లోలోపల సంబరపడుతున్నారు. ఇంతలో...అకస్మాత్తుగా ప్రత్యక్షమైంది పచ్చరంగు దుస్తులు వేసుకున్న మహిళ. ఆమె అద్భుత కౌశలంతో కత్తి తిప్పుతోంది... గురితప్పకుండా తుపాకీ పేల్చుతోంది. అనుచరులు యుద్ధరంగం వదిలివెళ్లినా... చెక్కుచెదరని ధైర్య సాహసాలతో శత్రువులనెదుర్కొంటోంది. చాకచక్యంగా తప్పించుకుంటూ ం ఎ్ ఎ ఎా ట ు లో మాయమైపోయింది. ఈమె ఎవరో? ఎక్కడి నుంచి వస్తోందో? ఎక్కడికెళుతుందో? బ్రిటీషు గూఢచారులకో అంతుచిక్కని పజిల్.



ఆమె ఏ క్షణంలో దాడిచేస్తుందో తెలీక వారు బిక్కబిక్కు మంటుండేవారు. ఆమె పేరేమిటో ఎవ్వరికీ తెలీదు... ప్రజలతో పాటు శత్రువులూ ఆమెను "పచ్చదుస్తుల మహిళ" గా పిలిచేవారు.

ఎప్పటిలాగే ఆ పచ్చ దుస్తుల మహిళ ఓరోజు బ్రిటీషు స్థావరంపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడింది. కళ్లు బైర్లు కమ్మాయి. పట్టుతప్పి, గుర్రం మీంచి పడిపోయింది. అదే అదనుగా భావించిన శత్రుసైన్యం ఆమెను చుట్టుముట్టింది. లెఫ్టినెంట్ హడ్సన్ కట్టుదిట్టమైన బందోబస్తుతో అంబాలా సైనిక స్థావరానికి పంపారు. మాతృదేశం పట్ల ఈమెకున్న గౌరవం బ్రిటీషు అధికారులనూ ఆకట్టుకుంది. ఆ ప్రభావంతో ఈమెను "జోన్ ఆఫ్ ఆర్క్" గా ఆంగ్లేయులు కీర్తించారు. ఆ తరువాత ఈమె ఏమైందో ఎవ్వరికీ తెలియలేదు.

ఇలా ఎందరో మహిళలు స్వాతంత్ర్యోద్యమంలో ప్రాణాలు కోల్పోయారు. మరెందరో దీన్ని ముందుకు నడిపించారు. ఎనలేని త్యాగాలు చేశారు. పురుషులకు ఏ మాత్రమూ తీసిపోని విధంగా పోరాడారు. స్త్రీ పురుషులిరువురూ కలిసి బ్రిటీషు వారిని తరిమేశారు. స్వాతంత్ర్యాన్ని సంపాదించారు. అలా పురుషులతో సమంగా పోరాడిన మహిళల జీవితంలో నేటికీ అసమానతలు తొంగిచూస్తున్నాయెందుకు? నేటికీ మహిళలు పురుషులతోపాటు సమానంగా శ్రమిస్తున్నారు. కానీ వారితో సమానంగా వేతనాలందుకుంటున్నారా? మగవారికేమాత్రమూ తీసిపోని అర్హతలున్నా... విద్యా ఉద్యోగాలలో స్త్రీల పై వివక్ష చూపడం ఎంతవరకూ సమంజసం? ఊపిరి పోసుకునేది ఆడపిల్లని తెలిస్తే...ఆ పిండాన్ని హతమార్చడానికే రెడీ అయిపోతారు. అంటే ఆమె జీవించే హక్కుని కూలదోయడమే కదా? ఈ కష్టాలూ కన్నీళ్లకు తోడు పురుషులు మత్తుపానీయాలు సేవించి, స్త్రీలను వేధించడం, కొట్టడం ఫ్యాషనైపోయింది. వరకట్న వేధింపులు, అత్యాచారాలు సర్వసాధారణమైపోయాయి. దాంతో సంసారాలు మరింత కుంగిపోతున్నాయి. "అర్ధరాత్రి ఆడది ఒంటరిగా బయటికెళ్లినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు" అని గాంధీజీ అన్నారు. అర్ధరాత్రి దాకా ఎందుకులేండి... పట్టపగలు ఎలాంటి అసభ్యకరమైన చర్యలూ ఎదురవ్వకుండా ఇంటికొచ్చే అమ్మాయిలెంతమంది? ఇంట్లోనూ వివక్షకు గురయ్యే వారి సంగతేంటి? ఏ అమ్మాయైనా తన పై చూపుతున్న అన్యాయాన్నెదిరిస్తే "బయల్దేరిందమ్మా ఓ ఝాన్సీ రాణి! దేశాన్ని ఉద్ధరించడానికి" అని ఎద్దేవా చేసే వారెందరో.... అంటే తనపై జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తే ఎందుకిలా అంటోందీ సమాజం. ఇదో పరిష్కరించని ప్రశ్న. చట్ట సభల్లో మహిళకు కేటాయించిన బిల్లును ఆమోదించేదాకా కాదుకదా బిల్లుగా ప్రవేశపెట్టేందుకే ఎన్ని అవరోధాలో చెప్పలేం...ఇంక దానికి ఆమోదం లభించేదెన్నడు? "గృహహింస" బిల్లు చట్టమై సరిగ్గా అమలౌతుందా?

ఆనాటి మహిళల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని, నేటి స్త్రీలు ముందడుగువేస్తేనే అది సాధ్యపడుతుందేమో....వేచిచూడాల్సిందేమరి. ✣



పిల్లల ఆరోగ్యానికి అదనపు ఆహారం

డా॥ ఆరవీటి రామయోగయ్య,

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఐదు సంవత్సరాల వయస్సు లోపు చిన్నారులలో 40 శాతం మంది ఏదో ఒక రకమైన పెరుగుదల లోపానికి గురవుతున్నారు. ఇందువల్ల పిల్లలు మానసికంగా, శారీరకంగా బాగా ఎదగడం లేదు.

పెరుగుదల లోపానికి కారణాలు

అభివృద్ధి చెందుతున్న దేశాలలో చిన్నారులలో పెరుగుదల లోపానికి ప్రధాన కారణం పేదరికం. పిల్లలు తరచుగా సూక్ష్మజీవుల వాతపడి విరేచనాల వ్యాధి, న్యూమోనియా వ్యాధులకు గురవుతున్నారు. ఇందువల్ల చిన్నారులలో పెరుగుదల సక్రమంగా ఉండటం లేదు. చాలా మంది తల్లులకు తల్లిపాలతో పాటు ఇవ్వవలసిన అదనపు ఆహారం గురించి సరైన అవగాహన ఉండటం లేదు. ఇందువల్ల పిల్లలు ఆహార లోపానికి గురవుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో తల్లులు పిల్లలకు అదనపు ఆహారం ఆలస్యంగా మొదలెడుతున్నారు. పట్టణ ప్రాంతాలలోని తల్లులు ఏమాత్రం ఆహార విలువలులేని డబ్బాలలో లభ్యమయ్యే అదనపు ఆహారం ఇస్తున్నారు. మనకున్న ప్రత్యేక వాతావరణ పరిస్థితుల వల్ల ఆహారం సులభంగా కాలుష్యమవుతుంది. నిల్వ ఉంచిన ఆహారం పసివారికి ఇవ్వడం వల్ల వారు వ్యాధులకు లోనై ఆహార లోపానికి గురవుతున్నారు. నులి పురుగుల వ్యాధి మన చిన్నారులను పీడిస్తున్న మరో సమస్య. పిల్లలు తీసుకునే ఆహారం పరాన్నభుక్కులకే సరిపోతుంది. పాలసీసాల ద్వారా పాలు పట్టడం ద్వారా చాలామంది పిల్లలు ఆహార లోపానికి గురవుతున్నారు. పాలసీసాలతో పోతపాలు తాగే పిల్లలు చాలా అపరిశుభ్రమైన పరిస్థితుల్లో ఏమాత్రం నాణ్యతలేని, ఆహార విలువలులేని పాలు తాగుతున్నారు.

పిల్లలు బాగా పెరగాలంటే...

కొన్ని సామాన్య జాగ్రత్తల ద్వారా చిన్నారులందరూ బాగా పెరిగేట్లు చేయవచ్చు. మహిళలందరూ గర్భధారణ సమయంలో తగినంత పోషకాహారం తీసుకోవాలి. ఇందువల్ల పుట్టుకతో బరువు తక్కువ పిల్లల జననాలు నిరోధించవచ్చు. పిల్లల శారీరక, మానసిక పెరుగుదల పుట్టినప్పుడుండే బరువుపై ఆధారపడి ఉంటుంది. పిల్లలందరికీ ఆరవ నెల వయస్సు వరకూ తల్లిపాలే అన్ని పోషకవిలువలు సమకూరుస్తుంది.

చిన్నారులకు ఆరవ నెలలో అదనపు ఆహారం మొదలు పెట్టండి. ఇంటిలో తయారుచేసిన ఆహార పదార్థాలు సరిపోతాయి. అదనపు ఆహారం బాగా ఉడికించి మెత్తగా ఇవ్వండి. అదనపు ఆహారంతో పాటు తల్లిపాలు ఇస్తూ ఉండాలి. మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు సాధారణంగా కుటుంబ సభ్యులు తీసుకునే నూనె పదార్థాల కన్నా అదనంగా నెయ్యి, నూనె పదార్థాలు ఇవ్వడం ద్వారా వారి పెరుగుదలను పెంచవచ్చు. పిల్లలకు ఎప్పటికీ కాచి చల్లార్చిన నీరే ఇవ్వాలి. దీని వల్ల విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు, నులిపురుగుల వ్యాధిని అరికట్టవచ్చు. ఈ వ్యాధుల వల్ల ఉత్పన్నమయ్యే ఆహార లోపం రాదు.

పిల్లలు బాగా పెరగాలంటే వారికి విటమిన్ – ఎ ఎక్కువగా లభించే ఆహార పదార్థాలు ఎక్కువగా ఇవ్వాలి. కేరట్, బొప్పాయి, మునగ, పచ్చని ఆకుకూరల్లో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది. పిల్లలు జబ్బుకు గురయినప్పుడు వారిలో పెరుగుదల లోపిస్తుంది. వ్యాధుల నుంచి కోలుకున్న తరువాత వారికి సాధారణంగా తీసుకునే ఆహారానికి తోడుగా ఎక్కువ ఆహారం ఇవ్వాలి. పిల్లల ఎదుగుదలకు ఆహారమేకాక వారితో ఆడాలి. పాడాలి. వారిపై ప్రేమ చూపించాలి. ఇందువల్ల వారు శారీరకంగా, మానసికంగా బాగా ఎదుగుతారు.

✤

అదనపు ఆహారం బాగా ఉడికించి మెత్తగా ఇవ్వండి. అదనపు ఆహారంతో పాటు తల్లిపాలు ఇస్తూ ఉండాలి. మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు సాధారణంగా కుటుంబ సభ్యులు తీసుకునే నూనె పదార్థాల కన్నా అదనంగా నెయ్యి, నూనె పదార్థాలు ఇవ్వడం ద్వారా వారి పెరుగుదలను పెంచవచ్చు. పిల్లలకు ఎప్పటికీ కాచి చల్లార్చిన నీరే ఇవ్వాలి.

మెడికల్ రిపోర్టు

డాక్టర్: (ఫోన్లో) సుబ్బారావ్ నీకు రెండు విషయాలు చెప్పాల్సి వచ్చినందుకు చాలా విచారంగా ఉందయ్యా

సుబ్బారావు: చెప్పండి డాక్టర్ నేను తట్టుకోగలను.

డాక్టర్: లాబ్ నుండి రిపోర్టు వచ్చింది. నువ్వు 24గంటలకు మించి బతకవని దానిలో ఉంది.

సుబ్బారావు: అవునా సార్ ... రెండోవిషయం చెప్పండి. కంగారుగా ఉంది.

డాక్టర్: అదే నయ్యా నీకీ విషయం చెప్పాలని మొన్నటి నుండి ఫోన్‌ద్వారా ప్రయత్నిస్తున్నా కుదిరి చావలేదు.

ఈశ్వర్, హైదరాబాద్

కథ

ఆ నవ్వులు వినబడేదెప్పుడో...

వి. వెంకటేశ్వర్లు

‘బాబుకెలా ఉందో... సుశీలెలా ఉందో” మెదడును తొలిచేస్తున్న ప్రశ్నలతోనే ఆంజనేయులు ఇంటికొచ్చాడు. అతనిలో నడవడానికి కూడా ఓపిక లేదు. అడుగడుగులో నిస్పత్తువ కనిపిస్తోంది. అయినా అలాగే కాళ్ళీడ్చుకుంటూ ఇంటి గుమ్మం వరకూ చేరాడు. ఇక ఇంటిలోకి అడుగేయాలి... ఈ ఆలోచన రాగానే ఆంజనేయులుకు గుండెదడ పెరిగింది. పిరికితనం తనదరి చేరకూడదనే ఆయన తండ్రి ఆయనకు ఆంజనేయులు అనే పేరు పెట్టాడు. కానీ ఈ సంస్కరణల యుగంలో ఏ దేవుడి పేరు పెట్టుకున్నా జీవితాన్ని సజావుగా సాగించడం ఎవరివల్లా కావడంలేదు.

పక్క గదిలో నుండి అప్పుడే ముందు గదిలోకొస్తున్న రెండేళ్ళు కూడా నిండని నవ్య పడక్కుర్చీలో కుప్పకూలిన తండ్రిని చూసింది. “అమ్మా... అమ్మా నాన్నొత్తేలే...” అంటూ వచ్చీరాని మాటలతో నవ్య వేసిన అరుపులకు సుశీల పరుగెత్తుకొచ్చింది. ఆంజనేయులులోని ఆందోళనను గుర్తించే స్థాయిలో ఆమె లేదు. ఆమె మనసునిండా పెద్దాడు నవీన్ గురించిన ఆందోళనే ఉంది.

“ఎన్ని తడిగుడ్డలేసినా బాబుకు జ్వరం తగ్గడం లేదండి. ఏదేదో పలవరిస్తున్నాడు. మధ్య, మధ్యలో ఎక్కిళ్ళొస్తున్నాయి. త్వరగా ఆ మందులిలా ఇవ్వండి.” అంటూ చేతులు చాచింది. సమాధానంలేని ఆంజనేయులు కళ్ళలోకి సూటిగా చూసింది. చెక్కిళ్ళ మీదుగా ధారావాహికంగా కారుతున్న కన్నీటిని గుర్తించింది. పరిస్థితిని అర్థం చేసుకుంది. డాక్టరు రాసిచ్చిన మందులు కొనడానికి అప్పు దొరకలేదు. నిస్సహాయంగా జీవచ్ఛవంలా పడక్కుర్చీలో వాలిన భర్తను ఓదార్చే ఓపిక ఆమెలో లేదు. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న నవీన్ పరిస్థితి ఆమెను తొలిచేస్తోంది. ఇంతలో లోపలి గదిలో నుండి పెద్ద మూలుగు వినిపించింది. సుశీల నవీన్ మంచం దగ్గరకు పరుగు తీసింది. పారాసిటమాల్ టాబ్లెట్ వేసి తడిగుడ్డలతో ఒళ్ళంతా కప్పింది. ఏం జరుగుతుందో అర్థం చేసుకునే వయసులేని నవ్య కాసేపు తండ్రి కుర్చీ దగ్గర నిలబడుతోంది. మరికాసేపు తల్లి దగ్గర కూలబడుతోంది. తననెవ్వరూ పట్టించుకోనందుకు ఆ పసి హృదయం నలిగిపోతున్నా.... ఏం జరుగుతుందో అర్థం చేసుకునే ప్రయత్నంలో మూగగా రోదిస్తోంది. ఇవేవీ గుర్తించే స్థితిలో లేని ఆంజనేయులు నిస్తేజంగా పడక్కుర్చీలోనే ఉండిపోయాడు. కంపెనీ సూపర్‌వైజర్‌గా అతని గత జీవితం కళ్ళముందు ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లా దొర్లసాగింది.

* * *

అప్పుడే జీతం అందుకున్న ఆంజనేయులు స్వీట్ షాప్‌కెళ్ళాడు. కొడుకుకు స్వీట్స్ తీ భార్యకు పూలు తీసుకున్నాడు. ఉదయం ఇచ్చిన సరుకుల జాబితా గుర్తుకొచ్చి సూపర్ మార్కెట్‌కెళ్ళి సరుకులు కొన్నాడు. ఇవి కొనగా మిగిలిన జీతాన్ని భార్య చేతిలో పెట్టి మూడేళ్ళ నవీన్‌ను అక్కున చేర్చుకున్నాడు. ముద్దులతో ముంచెత్తాడు.

“అబ్బ! చాల్లెద్దూ... అబ్బా కొడుకుల అనుబంధం” అంది సుశీల.

“ఓహో! నీకివ్వలేదని కుళ్ళా?” అంటూ సుశీలకూ ఓ ముద్దిచ్చాడు.

“చాల్లే. పట్టపగలు శ్రీవారి సరసాలు” అంటూ సుశీల సరుకుల సంచితో వంటింట్లోకి వెళ్ళింది.

ఆంజనేయులు చిరుద్యోగే. ఒక ఫ్యాక్టరీలో కూలీగా చేరి సూపర్‌వైజర్ స్థాయికెదిగాడు. నాలుగేళ్ళు పెళ్ళి చేసుకోకుండా పైసా, పైసా కూడబెట్టి తన వాడకట్టులోని వారితో కలిసి ఆక్రమించిన స్థలాల్లో చిన్న పూరిల్లు సంపాదించాడు. దాన్నే పొదరిల్లుగా మలచుకున్నాడు. ఆ తరువాతే పెళ్ళి చేసుకున్నాడు. నాలుగేళ్ళకు నవీన్ పుట్టాడు. వెయ్యిరూపాయల జీతగానిగా మొదలై నాలుగువేల రూపాయలకు చేరుకున్నాడు. అన్నింటా చేదోడువాదోడుగా నిలిచే భార్యనూ... ముద్దులొలికే మూడేళ్ళ కొడుకునూ చూసుకుంటూ మురిసిపోతున్నాడు. మరో ముద్దుల గుమ్మ పుడితే ఈ జీవితానికిక చాలనుకుంటుండగానే సుశీల గర్భవతని నిన్ననే డాక్టరు చెప్పిన మాటతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆ ఆనందంతోనే జీతం అందుకోగానే స్వీట్లూ, పూలూ కొన్నాడు.

మరుసటి రోజు ఆ వాడకు పక్కనున్న ఫ్యాక్టరీ సైరన్ మోగింది. దాంతో హడావిడిగా రెడీ అయ్యి టైమయిందంటూ తన ఫ్యాక్టరీకెళ్ళాడు. అప్పుడే పిడుగుపాటులాంటి వార్త విన్నాడు. తను పనిచేసే ఫ్యాక్టరీని ఒక బహుళజాతి కంపెనీ స్వాధీనం చేసుకోబోతోంది. అమ్మదలుచుకున్న యజమానులు పదేళ్ళ పైబడి సర్వీసున్న ఉద్యోగులందరికీ వీఆర్ఎస్ ఇస్తేనే టేకోవర్ చేస్తానందిట. దీంతో ఆంజనేయులుకీ వీఆర్ఎస్ అనివార్యమైంది. యాజమాన్యం ఇచ్చిన రెండు లక్షల రూపాయలతో వీధిన పడ్డాడు. దాంతో ఏం చేయాలో అర్థమయ్యేలోపు అర్నెల్లు గడిచిపోయింది. నవ్య పుట్టింది. వరాల లక్ష్మి అనుకుంటూ తోటి మిత్రునితో కలిసి బట్టల వ్యాపారం మొదలు పెట్టాడు. కపటం తెలీని ఆంజనేయులు రాతాకోతా లేకుండా మిత్రుణ్ని నమ్మి వ్యాపారంలోకి దిగాడు. రెండేళ్ళు బాగానే గడిచాయి. చేయూతనిచ్చిన మిత్రుడే ముంచెయ్యడంతో రెండు నెలలుగా ఆంజనేయులు ఇంట్లో పొయ్యిలో పిల్లి లేవని రోజుల సంఖ్య పెరిగింది.

* * *

“ఏమండీ!” పక్క గదిలో నుంచి సుశీల వేసిన వెర్రికేకకు ఆంజనేయులు ఉలిక్కిపడ్డాడు. ఒక్కుదుటున లోపలి గదిలోకి గెంతాడు. “మన నవీన్ ఇక....” అంటూ రాని మాటకు బదులుగా సుశీల చేతులూపిన తీరుతో బిడ్డ చనిపోయాడని గ్రహించాడు. నవీన్ కాళ్ళ దగ్గర కుప్పకూలాడు. “మందులు కూడా కొనలేని ఈ అసమర్థుణ్ని మన్నించు నాన్నా” అంటూ బోరున ఏడ్చాడు.

విషయం తెలిసి ఇరుగూ పొరుగూ పోగయ్యారు. భార్యా భర్తలిద్దర్నీ ఓదార్చారు. తెల్లవారి ఉదయాన్నే సన్నిహితులు అందించిన సాయంతో బిడ్డ శవాన్ని తీసుకుని ఆంజనేయులు స్మశానవాటిక దిశగా కదిలాడు. సుశీల గొల్లుమంది. తోటి మహిళలు కను చెమర్చారు. ఓదార్పు మాటలతో ఊరడించారు. కాసేపట్లో ఎవరింటికి వారు చేరుకున్నారు. ఇదేమీ అర్థంకాని నవ్య వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఒంటరిగా ఉన్న తల్లి ఒడిలోకి చేరింది.

“అన్నయ్యనూ... ఊ... ఎక్కలికీ తీసుకెల్లారు?” ఆ పసి హృదయం వేసిన ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో సుశీలకు తోచలేదు. మళ్ళీ మళ్ళీ వేసిన ప్రశ్నలకు తట్టుకోలేని సుశీల పెల్లుబుకుతున్న కన్నీటిని అణచుకుంటూనే “మన దారిద్ర్యాన్ని తట్టుకోలేని అన్నయ్య ఇక్కడ ఆనందంగా బతకలేక పోయాడు. మనల్నొదిలి పైలోకాల కెళ్ళాడమ్మా ! అక్కడ ఆనందంగా బతుకుతానంటూ పైకెళ్ళాడమ్మా” పొగిలే ఏడుపును అణచుకున్నా జాలువారే కన్నీళ్ళను ఆపలేకపోయింది. తనను ఓదార్చే తల్లే కన్నీళ్ళు పెట్టడాన్ని నవ్య తట్టుకోలేక పోయింది. ఆ చిట్టి చేతుల్తో చెక్కిళ్ళపై నిలిచిన కన్నీటి చారికల్ని తుడవసాగింది.

“ఏడొద్దమ్మా! నేనిక్కలే ఉంతాగా.... మీతోనే ఉంతా... ఆయిగా నవ్వుతా... తూలు... ఇలా కిలా... కిలా నవ్వుతా! హి...హ్హి...” అంటూ ఏడుపు కలగలిసిన నవ్వు తెచ్చుకుంటుండగానే ఆ నవ్వు వినపడకుండా ఆ వాడనానుకుని ఉన్న ఫ్యాక్టరీ సైరన్ మోగింది. ఆ సైరన్ కూతలోనూ సందిగ్ధమే... ఏ బహుళజాతివాడు తన గొంతుస్విచ్ ఆఫ్‌చేస్తాడోనని... పాపం నవ్య ... ఆ పసి హృదయానికేం తెలుసు... సంస్కరణల పేరిట బహుళజాతి సంస్థల గుప్పెట్లోకి చేరుతున్న యంత్ర భూతాలు నిరుపేదల ఇళ్ళల్లో నవ్వుల్ని మింగేస్తున్నాయని...! అయినా నవ్య నవ్వుతూనే ఉంది... ఆ నవ్వును మింగేస్తూ మూసివేత - తీసివేత లిస్టులో ఇంకా చేరని ఫ్యాక్టరీ సైరన్ మోగుతూనే ఉంది... ఈ మోతలో కలిసిపోయిన ఆ చిన్నారి నవ్వు పుత్రశోకంతో ఉన్న ఆ తల్లికి వినపడేదెప్పుడు? ✤

సింధు

ఎప్పటికెయ్యది....

ఎంత మొరాయించినా వినకుండా విక్రమార్కుడు భేతాళుణ్ణి గుంజి భుజానేసుకున్నాడు. చెట్టుదిగి యథా ప్రకారం రాజ్యానికేసి నడవసాగాడు. "నన్నొదులు... నన్నొదులు" అంటూ భేతాళుడు పిల్లాడిలా మారాం చేయసాగాడు. "ఏంటి భేతాళా? మరీ చిన్న పిల్లాడిలా....." విక్రమార్కుడు అనునయించే ప్రయత్నం చేయగా "నేను విసిగిపోయాను రాజా. నీతో రాను. నన్నొదులు...." భేతాళుడికి చిన్న పిల్లల చిందులొక్కటే తక్కువ. "ఈ సారి నాదే విజయం. అది యమలోక భాగోతమైనా, భూలోక రాజకీయమైనా..." విక్రమార్కుడు ధీమాగా చెప్పాడు "అలాగా! అయితే పద. మొన్ననే నెల్లూర్లో బీజేపోళ్ళు కార్యవర్గం జరిపి చిత్రమైన తీర్మానాలు చేశారు. ఈ సారి నీకు నేనొక సాయం కూడా చేస్తాను. మాట్లాడేవాళ్ళ నావహించి వాళ్ళతో నిజాలు పలికిస్తా. వేయాల్సిన ప్రశ్నల చిట్టా నీకు రాసిస్తా. ఇంత చేసినా నువ్వు నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదునుకో..." భేతాళుడు అంటుండగానే....."ఇంకేం మాట్లాడొద్దు. ఎవర్ని ఇంటర్వ్యూ చేయాలో చెప్పు. విజయం నాదే..." విక్రమార్కుని మాట పూర్తి కాకుండానే "అదిగో నాంపల్లి. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డిగారు ఒంటరిగా ఉన్నారు. నేనాయన్ని ఆవహిస్తాను. నువ్వు విలేకరిగా రా" అంటూనే భేతాళుడు అదృశ్యమయ్యాడు.

"నమస్తే సార్. నాపేరు వి.మార్క్. ఇంతవరకూ మిమ్మల్ని అలరించిన మా భేతాళ్ విక్రమార్క్ (బివి) టీవీ అదే పేరుతో కొత్తగా పత్రికను ప్రారంభించింది. దాని కోసం మీ ఇంటర్వ్యూ ...." అంటుండగానే "మీరొస్తున్నట్టు తెలుసండీ! ప్రశ్నలూ ఉన్నాయిగా. సూటిగా విషయానికి రండి." అనగానే వి.మార్క్ ఆశ్చర్యపోయినా వెంటనే తేరుకున్నాడు. 'ఓహో భేతాళుడి మహిమ' అనుకొని ఇంటర్వ్యూ ప్రారంభించాడు.

" రాష్ట్రంలో మీకిద్దరు ఎమ్మెల్యేలున్నారు కదా! వాళ్ళ పనెలా ఉంది సార్"

"హాయిగా ఉందయ్యా. ఏ చీకూచింతా లేకుండా అందరు చెప్పేవీ శ్రద్ధగా వింటున్నారు." తడుముకోకుండా ఇచ్చిన సమాధానంతో 'ఇంకా నయ్యం. బెంచీలపై నిద్రపోతున్నారని చెప్పావు కాదు' అని వి.మార్క్ స్వగతంగా అనుకుంటూ "అది కాదన్సార్. గత అసెంబ్లీలో ఇద్దరు సిపీఎమ్మెళ్ళే ఉన్నా ప్రజా సమస్యలపై మోతెక్కించారు కదా...." వి.మార్క్ ప్రశ్న పూర్తికాకముందే "అంటే వాళ్ళలాగా మేమూ రచ్చలూ రావిళ్ళూ చేయాలా? మాలో మేం రచ్చలు చేసుకునే జాతీయవిధానం మాది. ఉక్కు శిక్షణ కలిగిన పార్టీనయ్యా, అందుకే... ఇంద్రగారు ఇంకా ఏదో చెప్పబోతుండగానే ..." మరి పార్లమెంటులో ప్రతిపక్షంగా మీ పాత్రెలా ఉంది సార్?" అని వి.మార్కు ప్రశ్నించాడు.

"అధికారానికి రానంత మాత్రాన్నే ప్రతిపక్షమైపోతామా? దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. అదిగో ప్రజలో ప్రజలో అంటూ పోరాటాలు చేసే వారున్నారుగా.... ఆ సీపీఎమ్మెళ్ళకే దాన్ని వదిలేశాం... మా గొడవలతోనే ఛస్తుంటే ప్రతిపక్షంగా ఎలా ఉంటాం నువ్వే చెప్పు...." ఇంద్రగారి కంఠం కొంచెం జీరబోయింది.

"పాపం అంతేకదా సార్. ప్రజల కోసం మీ కార్యక్రమమేంటని జనం చెవులు కొరుక్కుంటున్నారు సార్." తన ప్రశ్నను చక్కగా అడిగినందుకు వి. మార్క్ రవ్వంత గర్వంగా కాలరెగరేశాడు.



"బోలెడన్ని చర్చిస్తున్నాం కదయ్యా. ఖాళీ ఉన్నప్పుడల్లా అయోధ్య రాముని గురించీ... హిందూత్వ ఔన్నత్యం గురించీ అసలు సిసలైన లౌకికవాదులుగా చర్చిస్తున్నామా? అంతెందుకు రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని కాంగ్రెసోళ్ళు ప్రకటించగానే నెల్లూర్లో సమావేశమయ్యామా! ఎన్నికలదాకా తీరిక లేకుండా మున్సిపాల్టీల్లో ప్రజల సమస్యల మీదా, తెలంగాణా కోసమూ పోరాడదామనుకున్నామా? ఇవన్నీ మా కార్యక్రమాలే కదయ్యా?" తలెగరేస్తూ ఇంద్రగారు సమాధానమిచ్చారు. "ఎన్నికలయ్యాక... పోరాడరా సార్..." వి. మార్క్ ప్రశ్న పెదవి దాటుతుండగానే "ఏం పిచ్చి ప్రశ్న వేశావయ్యా వి. మార్కో! ఎన్నికల్లో గెలిస్తే మాకారాముడితో, రాగాలతో పనేంటయ్యా... మానినాదాలన్నీ జమ్మి చెట్టు మీది బాణాలే కదా!" పిచ్చివాడా అన్నట్టు చూశారు ఇంద్రగారు. "అన్ని మున్సిపాల్టీల్లో మీరే గెలుస్తామంటారా.. సార్;..." వి.మార్క్ సందేహం.

"గెలిస్తే జనాన్ని ప్రశాంతంగా ఉండనిస్తాం. గెలిపించకుంటే... అది ప్రజల తలరాత. మేం మాత్రం సిన్సియర్‌గా గెలుపు కోసమే ఎన్నికల ముందు పోరాడతామన్నాం. అందు కోసం ఎన్నో ఏళ్లుగా మాతోపడున్న టీడీపోళ్లనీ కాలదన్నాం." ఇంద్రగారు మరో మాటకు సందులేకుండా గడగడా చెప్పేశారు.

"అదేంటి సార్..మరీ.. టీడీపోళ్ళే మీతో కలవబోమంటున్నారు...." సొంతంగా తనూ ఒక అనుబంధ ప్రశ్నవేసినందుకు వి.మార్క్ ఎంతో పొంగిపొయాడు.

"మేం కలవబోమనడంతో తట్టుకోలేక రోషంకొద్దీ అన్నారు లేవయ్యా. ఆ మాత్రం అర్థం చేసుకోలేవా?"

"అవుననుకోండి పాపం అసలెప్పటికీ మీతో కలవమన్నారు కదాసార్" 'అమ్మో! మరో అనుబంధ ప్రశ్నకూడా వచ్చింది.' "అన్నారులేవయ్యా! ఇంకా ఎన్నెన్నో అంటారు. అయినా ఇలా బీరాలు పోవడం టీడీపోళ్ళకేమన్నా కొత్తా? గుజరాత్ అల్లర్లప్పుడు సిఎంగా మోడీని దించకపోతే... అంటూ అటు పార్లమెంటులోనూ ఇటు రాష్ట్రంలోనూ భరతనాట్యం, కథాకళీ, బంగ్లాడాన్స్... ఒకటేమిటి వాళ్ళకెన్ని తెలుసో అన్ని చిందులూ వేశారు. చివరికేం చేశారు? ఓటింగ్‌కు గైర్హాజరై మోడీని గద్దెపైనే ఉంచారు. ఇదేనయ్యా రాజకీయం." అంటూ "ఎప్పటికెయ్యది....." తత్వం ప్రారంభిస్తుండగా... వి.మార్క్ ఏమనుకున్నాడో ఏమో "ఇంతవరకు సహకరించినందుకు ధన్యవాదాలు సార్." అంటూ వెనుదిరిగి చూడకుండా పరుగు తీశాడు. వి.మార్క్ విక్రమార్కుడయ్యాడు. భేతాళుడు ఇంద్రగారినొదిలి తన అసలు అవతారం ఎత్తాడు.

"ఇప్పుడుచెప్పు రాజా! టీడీపీ, బీజేపీవాళ్లు మున్సిపల్ ఎన్నికల్లో ఎందుకు విడిపోదామనుకుంటున్నారు?" భేతాళ ప్రశ్నతో విక్రమార్కుడు చింతాక్రాంతుడయ్యాడు. "అరే! కీలకమైన ఈ ప్రశ్న వేయలేదే.... ఏం చెప్పాలబ్బా...." విక్రమార్కుడు తీరని సందేహంలో కూరుకుపోయాడు.

ఇదిలా జరుగుతుండగానే ఈ అంశంపైనే చర్చిస్తూ వెళ్తున్న ఇద్దరు అటుగా వచ్చారు. అందులో ఒకరు "తెలంగాణా ఓట్ల కోసం బిజేపీ, ముస్లిముల ఓట్ల కోసం టీడీపీ ఒకరితో ఒకరు కలవకూడదని నాటకాలాడుతున్నారు. తెలంగాణాకు వ్యతిరేకంగా ఉన్న టిడిపితో ఉంటే బీజేపీకి తెలంగాణాలో ఓట్లురావు. బిజెపితో ఉంటే టీడీపీకి రాష్ట్రంలో ముస్లిముల ఓట్లు రావు. కనుక విడిపోవాలనుకుంటున్నారు. ఈ కలయిక, విడిపోవడంలో ప్రజా ప్రయోజనాలెక్కడున్నాయయ్యా?" ఈ మాటలు మొదలైనప్పుడే భేతాళుడు అప్రమత్తమయ్యాడు. ఈ మాటలు విక్రమార్కునికి వినపడకుండా భేతాళుడు వాయువునాశ్రయించి ఆ హోరులో ముంచేశాడు. సమాధానంలేని విక్రమార్కుని ఫేస్ చూసి ఇక లాభంలేదని ఎప్పటిలా భేతాళుడు తుర్రున చెట్టు మీదకు పారిపోయాడు.

✻

తెంగ్లీష్

డా॥ జె.పి. వైద్య

సింగురా ఇండియన్నూ... విక్టరీ సాంగూ...!

“ఝుండా ఉంచా రహే హమారా!” తోవ తప్పినట్టు హడావుడిగా వచ్చి చేరాయి బూడిద రంగు మబ్బులు...! వొళ్లంతా బురద పూసుకున్న తుంటరి పిల్లల్లా–నల్లటి రంగు పూసుకుని, నిండు గర్భిణి నడకతో అడుగులో అడుగులేస్తూ వచ్చాయి. నల్లటి పెద్దపెద్ద మబ్బులు...! తెల్లటి మబ్బులు దిగులుగా పక్కకు తప్పుకున్నాయి.

“ ఏం చేస్తం? మన రోజులు కావు... పూర్వం కవులు మన గురించి రాశింద్రు...హీరోయిన్ గూడ మనవైపు చూస్కుంట ‘ఎచట పోతివి’ అని దుఃఖంపాటలు పాడుతుండె...జమానా మారిపోయింది...‘కమ్‌కమ్ డియర్–మబ్బులు హియర్’ అనుకుంట పిసలేశినట్టు ఎగుర్తున్నరు. బ్యాగ్రౌండ్‌ల మబ్బులుండయి..సగం ప్లేటు ఇడ్లీలు కూడా కొనేటందుకు పైసలు దిక్కులేని హీరో ఫారిన్ జలపాతాల పక్కల సూటేసుకుని డ్యాన్సులు చేస్తున్నడు...డ్యాన్స్ అంటే ఏందీ? ప్యాంట్ల ఎలుకలు దూరినట్టు అష్టవంకర్లు పోకుంట ఊగుడు... హీరోయినయితే చెప్పనే చెప్పకు! తలంచుకుని చేతులల్ల ప్లేట్లూ.. ప్లేట్ల గిన్ని పూలు, వసుపు కుంకుమలూ, టెంకాయలూ తీసుకుని ‘గుడి’చుట్టు తిరుక్కుంట ‘దేవా! కరుణించవా’! అని పాటలు పాడుతుండె...ఉండుండి ఏమైతదో ఏమో... పేగుల తీరు తుక్డా..తుక్డాల జానా బెత్తెడు బట్టలల్ల స్విడ్జర్లాండు మంచుల ‘హాయ్! వేడిగున్నదీ...! ఏదో అయితున్నదీ!’ అనుకుంట పెట్రోల్ ఖతమ్ అయిన బండి తీరు ‘ఝట్కా’లు కొట్టుకుంట ఎగుర్తదీ? ఏం చెప్పాలే? ఎటు పోతున్నది. గీ మనుష్యుల సంస్కృతి...? మనుష్యులే మానవతను గాలికి వదిలేశింద్రు!



మనదేంవుంది? అంతా నల్లమబ్బుల దాదాగిరి నడుస్తున్నది...అవ్విటివే రోజులు...! హూఁ! మొన్న మన హైద్రాబాద్‌ను ఉతికినయి...!కనీవినీ ఎర్గనట్టు ‘ముంబై’ని ఉతికినయి...ఇప్పుడు దేశం నిండా పిసలేశినట్టు ఉతుకుతున్నయి...

మంది పరేషానైపోయి నడుంలోతు నీళ్లల్ల కొంపలెటున్నయి అని తోవలు వెతుక్కుంటున్నరు... పెద్దోళ్లేమో మీదకెళ్లి హెలికాప్టర్లల్ల తిరుక్కుంట...’భయపడకున్రి...! మీకు తక్షణమే సహాయం అందేట్టు పంచవర్ష ప్రణాళికలు తయారుచేస్తున్నం...! వరదల ముంపునకు గురవుతున్న బీద ప్రజానీకానికి తక్షణం ఏం అందించాలన్న చర్చలు ఫైవ్‌స్టార్ హోటల్లో సాగుతున్నాయి...! వాళ్ల చర్చలు యాడిదాకా వచ్చినై అని కనుక్కుంతందుకు ఒక కమిటీని గూడ నియమించినం...! వాళ్ల మీద నిఘా కోసం ఇంకో అఖిల పక్ష కమిటీని గూడ పెట్టాలనుకుంటున్నం’ అని లెక్చర్ల దంచుతున్నరు. మంది లీడర్ల సోది భరించలేక ‘మ్యాన్ హోల్ల’ పడి కొట్కపోతున్నరు.. ఏం చేస్తం;? అగో మల్లా నల్ల మబ్బులొస్తున్నయి...పోదాం పా!” అని తెల్ల మబ్బులు మర్యాదగా తప్పుకున్నాయి...

‘పంద్రా ఆగస్టొస్తున్నదీ...! మనమేటి నాయకుల త్యాగాన్ని తల్చుకో అంటున్నదీ’ అని కూని రాగాలు పాడుతూ పొద్దున్నే రోడ్లు ‘సాఫ్’ చేస్తున్న సిబ్బంది వైపు ఒక ‘సారు వారు’ తేరిపార చూస్తూ అందుకున్నరు...

“యూ? రోడ్ క్లీనింగా ? మరి, వాటబౌట్ ది గల్లీ? హూ క్లీనింగ్ గల్లీ ? మినిష్టరా? హూ మేడ్ మినిష్టర్ ? ఐ...! ఐ ది కామన్ మ్యాన్! ఐ గివ్ ఓట్...యూ గివ్ ఓట్. వుయ్ ఆల్ గేవ్‌డ్ వోట్స్...! వాట్ హ్యాపెన్డ్? దట్ ఫెల్లో బికేమ్ ఎంఎల్ఏ...! హిజ్జు మామా బికేమ్ మినిష్టర్...! హి హ్యాపీ! హిజ్ మామా హ్యాపి! వ్యాట్ ఎబౌట్ యూ అండ్ మీ? ఆఁ! నౌ యూ సీ ద రోడ్? సీ ది గల్లీ? సీ ది కొంపా? ఆల్ కచ్రా...కచ్రా...కచ్రా...? వై లుకింగ్ పిసపిసా? అర్థం కాలే...? అరె పిసోడా? తెల్గు సరిగ్గా అర్థంకాదా? భాషదేమున్నదయ్యా? భావం ఇంపార్టెంట్...‘ధూమ శకట గమనాగమన సూచిత తామ్ర పట్టికా’ అంటే అర్థమైతదిరా? సిగ్నల్’ అంటే సటుక్కున అర్థమై చచ్చిందా లేదా? అదీ సంగతి...! సమజ్ కొచ్చిందావురా పిసోడా...!

మనం రేపు ‘ ఇండిపెండెన్స్ డే’ సెలబ్రేటింగ్ ! అందుకే కదా మీరంతా క్లీనింగ్ ది రోడ్ అండ్ గల్లీ...యూ క్లీన్ ది రోడ్ అండ్ రిమూవ్ తుక్కూ చెత్తా చెదారం...! గుడ్! ఐ..వాట్ డూయింగ్..!క్లీన్ ది మైండ్స్ ఆఫ్ పూర్ పీపుల్స్...!యూ నో ది స్టోరీ...!ది స్టోరీ ఆఫ్ ఇండియా గెటింగ్ ఇండిపెండెన్స్! యూ షుడ్ నో గదా! అరే! పిసోడా! త్యాగాలు రా భయ్ త్యాగాలూ...!

గాంధీ తాతాస్ త్యాగాలూ...!

నెహ్రూ చాచాస్ త్యాగాలూ...!ఇంకా సో మెనీ పీపుల్స్ త్యాగాలున్నయి...! కాని, మే రెస్పాన్సిబుల్ సిటిజన్స్ కదా! ఆల్ ‘త్యాగా–పీపుల్స్’ పేర్లు చెప్తందికి టైం ఉన్నదా;?వేరే టైమ్ ? సింపుల్‌గా గీ టూ నేమ్ సఫిషియెంట్...! ఓకే! గాంధీ తాతా గేవ్ ఇండిపెండెన్స్...!

అండ్ అవర్ ఝుండా రెపరెపింగ్ ఎవర్ సిన్స్!

చూడూ...! లుక్...! అరే..నా మొకంకాయి కాదురా పిసోడా! స్వాతంత్రం కేమ్డ్...! సో మెనీ ఇయర్స్...! ఇంకా మీకు అండర్‌స్టాండ్ కాలే? హూఁ! వాట్ టుడూ...? చూడూ...చూడూ...! మీదికి...మీదికి...! లుక్...లుక్...! అప్పర్...అప్పర్...! దేర్ ఝుండా రెపరెపింగ్...!హౌ బ్యూటీఫుల్! బ్లూ బ్లూ స్కై...! వైట్‌వైట్ మబ్బుల్స్...! స్లో స్లో గాలి వీచింగ్...ఝుండా రెపరెపింగ్...! ఆహాహా! నో ఫుడ్ ఫర్ ఈటింగ్...! నో వాటర్ ఫర్ డ్రింకింగ్..! నో ఫ్రెష్ ఎయిర్ ఫర్ బ్రీదింగ్...! సో వాట్? కింద పూర్ అయినా మీద రెపరెపింగ్లే గదా?

“సింగ్ రా ఇండియనూ...

ప్లే–సింగ్‌రా విక్టరీ సాంగూ...”

అని అందుకున్నాడు సదరు ‘పెద్దాయన’ గీతాన్ని...తెల్ల మబ్బులు తెల్లమొహం వేసాయి...నల్లమబ్బులు తలబాదుకున్నాయి...వాటి కన్నీళ్లు ‘చిటపట చినుకుల్లా’ వర్షించసాగాయి...

“ ఏంటో దునియా! ఈ ‘ జెన్ట్...ఇల్...మ్యాన్’లు మంచిగీతాన్ని గూడ చిత్రహింస చేస్తున్నరు... ఎప్పుడు బాగుపడాలే మనం...మన దేశం...’ అని ‘పాడవోయి భారతీయుడా...ఆడిపాడవోయి విజయగీతికా...అని కూని రాగాలు తీస్తూ సిబ్బంది వాళ్ల పనుల్లో మునిగిపోయారు...

చిరునవ్వు నవ్వి–హుందాగా ‘తిరంగా’ రెపరెపలాడుతోంది. అన్ని భాషలకు అతీతంగా..అన్ని భావాలు, అందరి భావాలూ కలుపుకొని...!

✤

ఓ ఊరి కథ

హేమలత

నాటి బుద్ధుని కొండే... ఈ బొజ్జనకొండ

విశాఖజిల్లా అనకాపల్లి దగ్గర్లోని ఊరే ఈ బొజ్జనకొండ. గౌతమ బుద్ధుడి కొండగా ఒకనాడు ప్రసిద్ధికెక్కిందే ఈ గ్రామం. కాలక్రమేణా ప్రజల నానుడిలో బొజ్జనకొండగా పిలిచేది ఈ గ్రామాన్నే.

అదో చతురస్రాకార స్థూపవేదిక... దానిమీద ఓ వృత్తాకార స్థూపం. దాదాపు వంద అడుగులుంటుంది...కాలక్రమేణ ఇది ధ్వంసమైపోయింది. ఈ ఏకశిలా స్థంభంపైన అస్పష్టంగా ఒక లిపి కనిపిస్తుంది. ఇది అశోకుని శాసనమై ఉండవచ్చని చారిత్రకారుల అంచనా. ఈ స్థూపంపై చైత్యాలయాలు ఒకే స్థానంలో ఉన్నాయి. ఈ కొండ శిఖరాన్నే స్థూపవేదికగా చెక్కారు. ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ పురాతనకాలం నాటి బౌద్ధమత అవశేషాలు, అరుదైన శిల్ప కళా సంపద, అపారమైన చారిత్రక అవశేషాలు ప్రభుత్వాల ఉదాసీన వైఖరి వల్ల కాలగర్భంలో కలిసిపోయాయి.

దీని పక్కనే లింగాల కొండ చేపాకారంలో ఉంటుంది. ఈ కొండ పశ్చిమాగ్రాన్ని స్థూపాకారంగా మలిచారు. ఈ రెండు కొండలపై అలెగ్జాండర్ రిమ్ ఆధ్వర్యంలో పురావస్తుశాఖ తవ్వకాలు నిర్వహించింది. ఆ తవ్వకాలలో సముద్రగుప్తుని బంగారు నాణేలు, ఆంధ్రశాతవాహనుల సీసపు నాణేలు, చాణుక్యరాజైన కుబ్జవిష్ణువర్ధనుని రాగినాణేలు, మట్టి పాత్రలు ఇతర వస్తువులు లభించాయని చరిత్ర చెబుతోంది.

లింగాలకొండలో ఒక గుహ ఉంది. ఈ కొండ కింద దక్షిణపు అంచున మరో చిన్న గుహ ఉంది. దానిలో ఆసనం మీద కూర్చున్న భంగిమలో ఒక రాజు విగ్రహం ఉంది. ఈ రాజే ఒకప్పుడు వడ్డాది రాజధానిగా పరిపాలించిన అర్జున దేవుడని భావిస్తున్నారు.

ఈ స్థూపవేదిక చుట్టూ ఉన్న రాతి కట్టడానికి కాల్చిన ఇటుకలను వాడారు. ఏటా జనవరి నెలలో కనుమ పండుగ రోజున బొజ్జన్న కొండ వద్ద బ్రహ్మాండమైన ఉత్సవం చేస్తారు. ఎడ్లపందేలు అతి వైభవంగా నిర్వహిస్తారు. వేలాది మంది ఇక్కడికి చేరుకుని బుద్ధదేవుని కొలుస్తారు. ఈ కొండను దర్శించడానికి దేశం నలుమూలల నుండే కాక బౌద్ధమతం ప్రాచుర్యంలో ఉన్న శ్రీలంక, థాయ్‌లాండ్, జపాన్, మయన్మార్ దేశాల నుండి కూడా యాత్రికుల వస్తుంటారు.

సోలార్ లైట్లు

2002లో కేంద్ర పురావస్తు శాఖ 20 లక్షలతో ఈ కొండనభివృద్ధి చేసింది. దీని పై భాగంలో శిథిలావస్థలో ఉన్న స్థూప, చైత్య విహారాల ఉపరితలాలను పూర్తి స్థాయిలో మరమ్మతు చేశారు. పురాతనమైన బౌద్ధారామం కట్టడాలు స్ఫురణకొచ్చే విధంగా మరమ్మతు చేశారు. కొండనధిరోహించటానికి మెట్లు వేశారు. ఏటవాలుగా ఉన్న మెట్లెక్కేటప్పుడు పర్యాటకులు, సందర్శకులు ఇబ్బందికి లోను కాకుండా ఐరన్ రాడ్లనేర్పాటు చేశారు. బౌద్ధభిక్షువులు సమావేశం అయ్యే మహాస్థూపవేదిక, వారు నివసించే గదులను పునర్నిర్మించారు. లింగాల కొండపై భాగంలో నడవటానికి వీలుగా రోడ్లేశారు. రాత్రీ పగలు తేడాలేకుండా బొజ్జన్న కొండ, లింగాల కొండలపై సోలార్‌లైట్లనేర్పాటు చేశారు. విద్యుత్తుతో సంబంధం లేకుండా ఇవి వెలుగులను విరజిమ్ముతాయి. ✤

అవీ... ఇవీ

తొలి తీర్పు

పదహారేళ్ల విద్యార్థి ఒక రోజు తన పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇంటి తలుపు తట్టాడు. ఎవరూ అంటూ వచ్చిన ఆమెకు చేతిలోని కాగితాలను ఇచ్చి వాటిపై అభిప్రాయం చెప్పండంటూ తాను తిరిగి వస్తానని చక్కా వెళ్లి పోయాడు. తీరా ఆమె తెరిచి చూస్తే అవి కవితలు. తన విద్యార్థి ప్రతిభకు అచ్చెరువొంది ' నిజంగా నిజమైన కవి ' అని తీర్పు రాశారు. మూడుగంటల తరువాత ఆ విద్యార్థి వచ్చి ఆ తీర్పుతో ఉప్పొంగి పోయాడు. ఇంతకీ అతనెవరో తెలుసా?! ప్రపంచప్రఖ్యాతి గాంచిన చిలీ ప్రజాకవి పాబ్లో నెరూడా. తొలి తీర్పు ఇచ్చిన టీచర్ గాబ్రియేలా మిస్త్రల్.

నిజం...నిజం

కలల సౌధం కుప్పకూలినా
నీవు నిజం
నీ శ్వాస నిజం

నీ జీవితమే నిజమైనప్పుడు
మధ్యంతర అవాంతరాలెంత?
ఈ ఆటంకాలెంత?

ఆగక సాగు నీ గమ్యం వైపు
నిలవక కదులు నీ లక్ష్యం వైపు
అప్పుడు నీవు నిజం
నీ విజయం నిజం

నేస్తం!
నిజమన్నదొక్కటే లోకంలో
నిలదొక్కుకోవటమే జీవితంలో!!

- రాజేందర్ రాజు

ఆబ్బే తాగడం లేదు!

డాక్టర్ బాటిల్ పట్టుకుంటే చాలు నా చేయి వణికి పోతోంది అన్నాడో పేషెంట్.

ఏం మందు ఎక్కువగా తాగుతున్నావా అన్నాడు డాక్టర్.

లేదు అంతా పారపోసుకుంటున్నా

ఈశ్వర్, హైదరాబాద్

అక్షరాలతో ఆకృతి

"నిరంకుశత్వమా-స్వాతంత్ర్యమా"

విజ్ఞాన వీచిక



వృద్ధాప్యానికి వాయిదా !

ఎస్. వెంకట్రావు

ముసలితనం, వృద్ధాప్యం, వార్థక్యం....ఏ పదంతో పిలిచినా మనిషి జీవితంలో అనివార్యంగా వచ్చే ఒక దశ అది. కాని అది అంటేనే అనాదిగా మానవునికి భయం, అసహ్యం కూడా. 'చిరంజీవి'గా ఉండాలనే కోర్కెతోబాటు నిత్యయవ్వనునిగా ఉండిపోవాలన్నది కూడా మనిషికి ఒక చిరకాల వాంఛ. బహుశా మనిషి తననుగురించి తాను తెలుసుకోవడం ప్రారంభించినప్పటినుండి వృద్ధాప్యంలేని జీవితం గురించి ఆలోచిస్తున్నాడు. ఉండాలనుకుంటున్నాడు. మానవేతిహాసాలన్నిటా అతని ఈ ఆలోచనలు మనకు దర్శనమిస్తుంటాయి. పురాతన ఈజిప్టు పిరమిడ్లలోనూ, భారతీయ, చైనీస్, యూరోపియన్ చారిత్రక నిర్మాణాలు, గ్రంథాల్లోనూ నిత్యయవ్వనం కోసం, చిరజీవితం కోసం మానవుడు పడినపాట్లకు సంబంధించిన కథలు కోకొల్లలుగా లభిస్తాయి. మూలికా వైద్యం, మంత్ర తంత్రాలు, యజ్ఞయాగాలు, పూజలూప్రార్థనలు, క్షుద్రదేవతారాధనలు ఒకటేమిటి మనిషి చిరంజీవి కావడానికి, నిత్యయవ్వనంతో తులతూగడానికి అనేక ప్రయత్నాలు చేసినట్లు చరిత్ర మనకు చెబుతుంది.

నిజానికి మనిషి జీవితంలో వృద్ధాప్యం ఒక మహత్తర దశ. వృద్ధాప్యం రావడం అంటే మనిషి పరిపక్వమవడం. అతని ఆలోచనలు వికసించడం. లోకాన్నిగురించిన అవగాహన పెరగడం. ఇంత ఉన్నతమైన మానవజీవన దశ ఇంతగా ఏహ్యభావానికి ఎందుకు గురవుతోందంటే....వృద్ధాప్యంతో బాటు వచ్చే రుగ్మతలు, వ్యాధులు, నీరసాలు, నిరాశలు ఇవీ కారణాలుగా కనిపిస్తాయి. వృద్ధాప్యం అంటే జీవితానికి చివరి దశ అనే వాస్తవం కూడా మనిషి వృద్ధాప్యాన్ని అసహించుకోడానికి కారణం కావచ్చు. అందువల్లనే 'చావు' అనేది లేకుండా చేస్తే?.... వృద్ధాప్యం లేకుండా చేస్తే?.... వృద్ధాప్యం, చావు రెండూ లేకుండా చేస్తే?.....ఒక వేళ వృద్ధాప్యమున్నా చావులేకుండా చేస్తే?....చావున్నా వృద్ధాప్యం లేకుండా, వృద్ధాప్యంలో వచ్చే రుగ్మతలు లేకుండా చేస్తే?.....అనాదిగా మానవసమాజంతోపాటే వస్తున్న ఈ ప్రశ్నలు నేటికీ జవాబుల్లేకుండా అలాగే ఉన్నాయి. అయితే ఈ సమస్యలపై ఆధునిక సైన్సు ఏం చెబుతోంది, అసలు వృద్ధాప్యం గురించి సైన్సూ, శాస్త్రవేత్తలూ పట్టించుకుంటున్నారా....?

> **"మనిషిలోని కణాలుగాని, మొత్తంగా మనిషిగాని చనిపోకుండా చేయడం 'పుట్టిన ప్రతిదీ గిట్టక మానదు' అన్న మౌలిక తాత్వానికి విరుద్ధమైనవి చనిపోయేవరకు వృద్ధాప్యం వల్ల వచ్చే రుగ్మతలు లేకుండా ఉంచడం మంచిదని శాస్త్ర ప్రపంచంలో మెజారిటీ అభిప్రాయపడుతున్నారు"**

"యస్సో... యనభైఏళ్ళ కుర్రాణ్ణే"!

శాస్త్ర-సాంకేతికాభివృద్ధి మానవుని వయోపరిమితిని గణనీయంగా పెంచింది. 20వ శతాబ్ది ఆరంభంలో మానవుని సగటు వయోపరిమితి 50 సంవత్సరాలు కాగా శతాబ్దాంతానికి అది 75 ఏళ్లకు చేరుకుంది. అంటే 50 శాతం పెరిగింది. ప్రజల్లో పరిశుభ్రత పెరగడంతో బాటు అంటురోగాలు నిరోధించడం, శిశుమరణాలను అరికట్టడం, వైద్యశాస్త్రం బాగా అభివృద్ధిచెందడం వల్ల ఇది సాధ్యమైంది. వయోపరిమితి పెంచడంతో బాటు వృద్ధాప్యాన్ని నివారించడం, వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులను నివారించడం, ముఖ్యంగా చర్మం, ముఖం, మెదడు ఇతర అవయవాల్లో వచ్చే వినాశకర మార్పులను నివారించడం ఎలా అన్న దానిమీద పరిశోధనలు ప్రారంభమైనాయి. ఆధునిక వైద్యశాస్త్రంలో దీన్ని "గెరెంటోలజి' అంటున్నారు. ఫ్రెంచ్ వైద్యశాస్త్రవేత్త జీన్ మార్టిన్ చార్కోట్ ఈ వైద్యశాస్త్ర విభాగానికి ఆద్యుడుగా చెప్పవచ్చు. 'వృద్ధాప్య వ్యాధులపై క్లినికల్ లెక్చర్స్' అన్న తన ప్రఖ్యాత గ్రంథంలో ఆయన తొలిసారి వయసుమీదపడ్డంతో పాటే శరీరంలో వచ్చే మార్పులు, వచ్చే వ్యాధులను గురించి శాస్త్రీయ పరిశోధనా వివరాలు వెల్లడించారు. తరువాతి కాలంలో పంతొమ్మిదో శతాబ్దం ద్వితీయార్థమంతా వృద్ధాప్యం, దాని వల్ల వచ్చే వ్యాధులపై పలుపరిశోధనలు జరిగాయి. మానవుల వయోపరిమితి పెరుగుతున్న కొద్దీ, ఆర్థిక, శాస్త్ర-సాంకేతికాభివృద్ధి జరుగుతున్న కొద్దీ వృద్ధాప్యాన్ని జయించాలన్న వాంఛ మనిషిలో మరింత పెరుగుతూ వచ్చింది. చిత్ర విచిత్రమైన మందులు ఉనికిలోకి వచ్చాయి. ప్రజల్లోని ఈ కోర్కెను సొమ్ముచేసుకోడానికి 'చైనా మూలికా వైద్యం', 'ఆయుర్వేదం', 'లేహ్యాలు', 'రసాలు' అంటూ రకరకాల చిట్కావైద్యాలు రంగంలోకి వచ్చాయి. ఈ చిట్కావైద్యులకు ఆద్యుడిగా ఫ్రెంచ్ 'వైద్యనిపుణుడు' చార్లెస్ ఎడువార్డ్ బ్రౌన్-సెక్వార్డ్ ను గురించి చెప్పుకోవచ్చు. కుక్క వృషణాలను చితక్కొట్టి రసాన్ని తాగితే మనుషులకు యవ్వనం తిరిగి వచ్చేస్తుందని ఆయన చెప్పాడు. ఇలాంటి 'పరిశోధనల'నుండి, ఇలాంటి చిట్కావైద్యాలు చాలా వచ్చాయి. అంతేకాదు వృద్ధాప్యంపై పరిశోధనలు ఒక వైపు సాగుతుండగానే ఆ పరిశోధనలను ఉపయోగించుకుని ఒక పరిశ్రమ పెరిగి పెద్దదై ఇప్పుడు ప్రపంచ వ్యాపిత మార్కెట్‌గా మారింది. ఈ 'వృద్ధాప్యనివారణ మార్కెట్'లో యోగోర్ట్ క్యూర్స్, ఎనిమా రెజిమెన్స్, సెల్ ఇంజక్షన్లు, అయస్కాంత పరికరాలు, చర్మ క్రీములు, హెర్బల్ మందులు, గ్రంథులనుండి తీసిన రసాలు, హార్మోన్ థెరపీలు, విటమిన్ సప్లిమెంటులు, డైటింగ్, ఎక్సర్‌సైజులు వగైరా చాలాచాలా వున్నాయి. ఇదో పెద్ద కార్పొరేట్ పరిశ్రమగా మారింది.

వృద్ధాప్యాన్ని వాయిదా వేయవచ్చా ?

ఇవన్నీ ఎన్ని వచ్చినా అసలు సమస్య ఉండనే ఉంది. చిరంజీవిత్వం సాధించగలమా, వృద్ధాప్యం లేకుండా చేయగలమా....? వైద్యశాస్త్రంలో, ఇంకా విస్తృతంగా జీవశాస్త్రంలో దీనిపై మూడు దిశల్లో పరిశోధనలు జరుగుతున్నాయి. మొదటిది, జీవకణజాలాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా వృద్ధాప్యానికి సంబంధించిన వ్యాధులు లేకుండా చేయడం. దీన్ని 'కంప్రెస్స్‌డ్ మోరిబిడిటీ' అంటున్నారు. ఈ పద్ధతిలో అంతిమ లక్ష్యం మరణాన్ని జయించడం కాదు, అలాగే జీవన ప్రమాణాన్ని గరిష్ట స్థాయికి తీసుకుపోవడమూ కాదు. వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులను లేకుండా చేసి, మనిషి ఆయుః ప్రమాణాన్ని పొడిగించడం అంటే చనిపోయేవరకు మనిషి యవ్వనుడిలాగా చురుకుగా ఉండ్లేట్లు చేయడం దీని లక్ష్యం. మరో మాటలో చెప్పాలంటే పూర్తిజీవితాన్ని చురుకుగా గడిపి అకస్మాత్తుగా చనిపోతాడు. రెండవపద్ధతిలో వృద్ధాప్యాన్ని జాప్యం చేయడం, నెమ్మదిగా వచ్చేట్లు చేయడం ద్వారా జీవితకాలాన్ని గరిష్టస్థాయికి పెంచడం. దీన్ని 'డిసెలెరేటెడ్ ఏజింగ్' అంటున్నారు. ఇక మూడవది, 'వృద్ధాప్యాన్ని నయం చేయడం'. అంటే మనిషి శరీరంలోని జీవన వ్యవస్థల నిరంతర పనివల్ల జరిగే నష్టాన్ని ఎప్పటికప్పుడు నిర్మూలిస్తూ జీవితాన్ని 'అనంతంగా' పెంచుకుంటూ పోవడం. దీన్ని "అరెస్టెడ్ ఏజింగ్" అంటున్నారు.

'పుట్టిన ప్రతిదీ గిట్టక మానదు' అన్న మౌలిక తత్వానికి విరుద్ధమైనవి చివరి రెండు పద్ధతులు. మనిషిలోని కణాలుగాని, మొత్తంగా మనిషిగాని చనిపోకుండా చేయడం సాధ్యంకాదు గనుక చనిపోయేవరకు వృద్ధాప్యం వల్ల వచ్చే రుగ్మతలు లేకుండా ఉంచడం - అంటే మొదటి పద్ధతి - మంచిదని శాస్త్ర ప్రపంచంలో మెజారిటీ అభిప్రాయపడుతున్నారు. అన్ని రకాల పరిశోధనలూ సాగిపోవాల్సిందే! 'మానవ జీవితమే ఒక వ్యాధి, చావే దానికి మందు' అన్నవైరాగ్యాన్ని నెట్టుకుంటూ, తోసుకుంటూ, ఛేదించుకుంటూ... మానవజీవితాన్ని సుఖవంతం చేయడమే లక్ష్యంగా పరిశోధనలు మున్ముందుకు సాగాల్సిందే! ✤

కొత్త పుస్తకాలు



మాకియవెల్లి

ప్రపంచ రాజకీయ చరిత్ర అధ్యయనంలో తప్పనిసరిగా చదవాల్సినవి మాకియావెల్లి రచనలు. ఆధునిక రాజ్య వ్యవస్థ ఆవిర్భావ సూత్రాలను విశదం చేసిన ప్రథమములో ఆయనొకరు. నిస్సంకోచంగానూ నిర్ద్వంద్వంగానూ బోధించడం వల్ల ఆయనొకరు. ఆయన చాలా క్రూరనీతికి ప్రతీకగానూ పరిగణించబడుతుంటారు. శతాబ్దాలు గడిచినప్పటికీ మాకియవిలియన్ అన్నమాట భాషలో భాగంగా కొనసాగుతున్నది. ఇంతకూ మాకియవెల్లి ఏం చెప్పాడు ? అవి నేటి కాలానికి ఏ విధంగానైనా వర్తిస్తాయా ? క్లుప్తంగా ఈ పుస్తకంలో చదవండి.

కాట్రగడ్డ నరసయ్య, వెల 5/-, పేజీలు 24, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20

మహాత్ముడు



భారతదేశ స్వాతంత్ర్యా నికి పాటు పడిన వ్యక్తిగా, జాతిపితగా కొనియాడే గాంధి జీవిత చరిత్ర ఇది. సామాన్యుడి నుండి మహాత్ముడి వరకు ఎదిగిన గాంధి తాత కథను పిల్లలకు అర్థమయ్యే విధంగా రాసిన ఈ పుస్తకం, వయోజన విద్యా వచనంగా కూడా ఉపయోగపడుతుంది.

"మహాత్ముడు" (సంక్షిప్త జీవిత కథ)
దాశరథి రంగాచార్య
ప్రతులకు : విశాలాంధ్రత పబ్లిషింగ్ హౌస్ వెల 15/-, పేజీలు 47

"వివేకానందుడు"
(సంక్షిప్త జీవిత కథ)
దశరథి రంగాచార్య ముద్రణ
ప్రతులకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
వెల 10/-, పేజీలు 29



వివేకానందుడు

మానవసేవయే మాధవ సేవ అని విశ్వసించి మానవాళికి ప్రేమ, సేవాధర్మాన్ని ప్రబోధించిన స్వామి వివేకానందుని కథను సులభశైలిలో పిల్లలకు ఆసక్తికరంగా ఉండే విధంగా ఆయన జీవితాన్ని, గొప్ప తనాన్ని వివరించిన చిరుపుస్తకమిది .

కె.పి. అశోక్‌కుమార్

మూడు తరాల నవల

1940-70ల కాలం నాటి ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిణామాలను చిత్రీకరించిన నవల "జీవన స్రవంతి" కోస్తా జిల్లాల్లో నివసిస్తున్న కుటుంబాల జీవన పరిస్థితులను, వారి ఆలోచనా విధానాలను ఆచార వ్యవహారాలను చిత్రీకరించిన ఈ నవల ప్రధానంగా అచ్యుతరామయ్య కుటుంబ చరిత్రకే పరిమితమై పోయింది.

వ్యవసాయదారుడైన అచ్యుతరామయ్య, తన కృషితో, నేర్పుతో తన ఆస్తిని పెంచుకున్నాడు. దానితో పాటు పిల్లలనూ ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. ఆయన కొడుకు కృష్ణమూర్తి సేల్స్‌టాక్స్ ఆఫీసులో పనిచేస్తుంటాడు. భార్య వియోగంతో అచ్యుతరామయ్య ఒంటరివాడైనప్పటికీ కొడుకు దగ్గర వుండలేక, ఊళ్లో వ్యవసాయం చేసుకుంటూ ఉండిపోతాడు. అచ్యుతరామయ్య అల్లుడు లక్ష్మీనారాయణ డిగ్రీ చదివినా ఉద్యోగం చేయక వ్యవసాయంలోనే స్థిరపడతాడు. అతనివన్నీ అభ్యుదయ భావాలే. గ్రామ ప్రజల మూఢనమ్మకాలను పారద్రోలుతాడు. వారి విద్యావ్యాప్తికి పాటుపడతాడు. స్త్రీలకు విద్య, స్వాతంత్ర్యమవసరమని నమ్మే ఆదర్శవాది. తన ఆత్మర్థాలకు అనుగుణంగా తన జీవితాన్నెలా మలుచుకున్నాడో ఈ నవల తెలియచేస్తుంది.



జీవన స్రవంతి
రచన: మొదలి అరుణాచలం
వెల 65/-, పేజీలు : 239
402, శ్రీరామా అపార్ట్‌మెంట్స్, నారాయణగూడ, హైదరాబాద్

లక్ష్మీనారాయణ, కేశవమూర్తిలతో పాటు అచ్యుతరామయ్య కూతుళ్లు కనక, రాజ్యలక్ష్మి. వారి పిల్లల పెరుగుదల, చదువులు, పెళ్లిళ్లు, వారి ఉద్యోగాలు మొత్తం వారి వంశ చరిత్రను నవలారూపంలో రికార్డు చేసిన ప్రయత్నమే "జీవన స్రవంతి" నవల.

ఈ నవలలో ఏ ఒక్క పాత్రా స్వాతంత్ర్య సమరంలో పాల్గొనకపోవడం ఆశ్చర్యకరం. అప్పటి సామాజిక పరిస్థితులలో వైయుక్తిక ఎదుగుదలకు రచయిత ప్రాధాన్యమిచ్చారని పాఠకులు సులభంగానే గ్రహించగలుగుతారు. అయినా ఉమ్మడి రాష్ట్రాల సమస్యలు, ఆంధ్రప్రదేశ్ అవతరణ, పంచవర్ష ప్రణాళికలు, పంచాయతీ వ్యవస్థ లాంటి రాజకీయాంశాలను సందర్భానుసారంగా వివరించగలిగారు. పెళ్లిళ్లు, పండుగలు చక్కగా తెలియజేశారు. సంఘటనలను వరుసగా ఏకరువు పెడుతూ సాగిపోవడం వల్ల ఈ నవల దాదాపుగా డైరీలా, ఒక డాక్యుమెంటరీలా సాగిపోయింది. నాటకీయత విధానాన్ని రచయిత గుర్తించినట్లయితే ఈ నవల మరింత ఆసక్తిగా తయారయ్యేది.

హ్యాపీ బర్త్ డే

14.8.2005 నుంచి
20.8.2005 వరకు

ఎన్. హర్షిత యాదవ్
1సం॥, 19.8.2004
ఇందిర-హనుమంతరావు
చిట్వేలి-కడప

టి. తేజస్వి
5సం॥, 20.8.2000
రజని-శ్రీనివాసరావు
బోనకల్లు-ఖమ్మం

పి. హారిణి
1సం॥, ఆగస్టు-2004
సుజాత-మల్లికార్జున్
మెద్చెల్-రంగారెడ్డి

జి. మమత
10సం॥, ఆగస్టు-1995
సుమతి-వెంకట్‌రాంరెడ్డి
చిట్టిగిద్ద-రంగారెడ్డి

కె. మానస
5సం॥, ఆగస్టు-2000
ఝాన్సీ-మోషే
ఆరుగొలను-ప॥గో॥

కె. వంశీధర్‌రెడ్డి
1సం॥, ఆగస్టు-2004
సుధారాణి-మహేంద్రరెడ్డి
బుచ్చిరెడ్డిపాళెం-నెల్లూరు

పి. గాయత్రి
1సం॥, ఆగస్టు-2004
ధనలక్ష్మి-ధనశేఖర్
రేణిగుంట-చిత్తూరు



యశస్విని
సుజాత-వెంకయ్య
నెల్లూరు

జవహర్
8సం॥, ఆగస్టు-1997
నరసింహారావు
జగ్గయపేట-కృష్ణా

జి. సువర్ణ
6సం॥, ఆగస్టు-1999
సుగుణ-నారాయణ
మక్తాల్

ఉమ్‌రుమన్ అలీమ్
రజియాబేగం-మహమ్మద్ అలీమ్
మహబూబ్‌నగర్

డి. సత్యనారాయణ
3సం॥, 20.8.2002
వరలక్ష్మి-వీరబాబు
ప్రత్తిపాడు-తూ॥గో॥

ఎన్. పరశురాం(పండు)
వాణి-ఓబులయ్య
మామండూరు-చిత్తూరు

పి. ఉదయ్‌కిరణ్
4సం॥, ఆగస్టు-2001
విజయ-ఆశయ్య
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

ధనుష్‌కుమార్
2సం॥, ఆగస్టు-2003
కళ-రాఘవేంద్ర
నాగులగుట్టపల్లి-కడప

కంది ఉండలు

కావలసిన వస్తువులు

కందిపప్పు	:	ఒక కప్పు
శనగపప్పు	:	ఒక కప్పు
మినపప్పు	:	ఒక కప్పు
కొత్తిమీర	:	ఒక కట్ట
కరివేపాకు	:	ఆరు రెమ్మలు
జీలకర్ర	:	ఒక టీ స్పూన్
పచ్చిమిర్చి, ఉప్పు పేస్టు	:	రెండు టీ స్పూన్లు
అల్లం పేస్టు	:	అర టీ స్పూన్
ఉల్లిపాయ ముక్కలు	:	రెండు కప్పులు
పచ్చి మిర్చి	:	పది
నూనె	:	పావు కప్పు
వంటసోడా	:	అర టీ స్పూన్
తాలింపు గింజలు	:	రెండు టీ స్పూన్లు

తయారుచేసే విధానం

అన్ని పప్పులను నాలుగు గంటలు నానబెట్టి కొంచెం బరకగా రుబ్బుకోవాలి. ఈ పిండిలో ఉల్లిపాయ ముక్కలు, సన్నగా తరిగిన కొత్తిమీర, కరివేపాకు, పచ్చి మిరప ముక్కలు, జీలకర్ర, వంటసోడా వేసి బాగా కలపాలి. నూనె వేడిచేసి తాలింపు చేసి అందులో అల్లం, పచ్చిమిర్చి పేస్ట్ వేసి ఒక నిముషం వేగనిచ్చి పిండిలో కలపాలి. ప్లేట్‌కు నూనె రాసి పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి పెట్టి ఆవిరికి ఉడికించాలి. లేదా ఇడ్లీ స్టాండ్ రేకులకు నూనె రాసి ఉండలుగా చేసి పెట్టి ఆవిరికి ఉడికించాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి. వేడివేడిగా సర్వ్ చేయాలి. ఆయిల్ ఎక్కువగా లేకపోవడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది.

హోళిగలు

కావలసిన వస్తువులు

కందిపప్పు	:	అరకిలో
బెల్లం	:	అరకిలో
నూనె	:	తగినంత
యాలకులు	:	నాలుగు
బొంబాయిరవ్వ	:	పావు కిలో
మైదా	:	వంద గ్రాములు
గసగసాలు	:	25 గ్రాములు

తయారుచేసే విధానం

బొంబాయి రవ్వ, మైదాను జల్లించాలి. నాలుగు గంటల ముందుగా కొంచెం ఉప్పు, నూనె వేసి పూరీల పిండి కంటే కొంచెం లూజ్‌గా కలుపుకోవాలి. కందిపప్పును మెత్తగా ఉడికించాలి. అందులో నీరు మిగిలి ఉంటే వాటిని వంపేసి బెల్లం నలగ్గొట్టి వేయాలి. అది బాగా ముద్దగా అవుతుందనగా యాలకుల పొడి వేసి కలిపి దించాలి. బాగా చల్లారిన తరువాత గ్రైండ్ చేయాలి. పొయ్యి మీద పెనం పెట్టాలి. ఇప్పుడు ఒక పాలిథిన్ పేపర్ తీసుకొని దానికి నూనె రాసి నిమ్మకాయ సైజంత మైదా పిండిని తీసుకొని పల్చగా వత్తి దాని మీద పూర్ణం పిండి పరిచి చుట్టూ కవర్ చేయాలి. దానికి గసగసాలు అద్ది దానిని మరలా చేతితో పల్చగా వత్తాలి. కాలిన పెనం మీద దీనిని వేసి సన్న సెగమీద కాల్చాలి. కాల్చేటప్పుడు కొంచెం నెయ్యిగాని, నూనెగాని వేయాలి. దీనిని నేతితోగాని, పాలతోగాని అద్దుకొని తింటే చాలా రుచిగా ఉంటుంది.

– కె. సాయి మనోజ్ఞ, నర్సాపురం, ప.గో. జిల్లా